# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 37 సంచిక 12
పేజీలు 44
ఆగస్ట్ 2018

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ................................ ....... పేజీ**

భద్రవాక్యం ....................................4
శ్రీబాబూజీ ఉవాచ.................................... 5
అమ్మమాట.................................... 7
త్రిపురా రహస్యం .................................... 9
కర్మ - మోక్షము ........................ ........................11
శ్రీబాబు బృందావన ధామము - శ్రీ సామి నారాయణ్ అక్షర్‌ధామము ................................13
వార్తా లహరి ....... ........................ ........................16
ఏకమేవ అద్వితీయం బ్రహ్మ ........................19
శ్రీకృష్ణ కర్ణామృతము ....................................22
యోగవాశిష్ఠము .................................... 23
జీవితానుభవం ....................................25
చార్‌ధామ్ యాత్ర .............. ....................26
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు................................28
పరిప్రశ్న .................................... ..29
ఆధ్యాత్మికం - సోషలిజం .............. ....................32
సోహం ....................................34
కైవల్యోపనిషత్ ... ....................................36
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ........................ ....................41

# భద్ర వాక్యం - పరాశర ప్రసాద్

**యశ్శతరుద్రీయమధీతే సోऽగ్నిపూతో భవతి ।**
**సురాపానాత్ పూతోభవతి । బ్రహ్మహత్యాయ్త్పూతోభవతి।**
**కృత్యాకృత్యాత్ పూతోభవతి। తస్మాద్విముక్తో భవతి।**
**అత్యాశ్రమీ సర్వదా సకృద్వా జపేత్ ॥**

**(కైవల్యోపనిషత్ ఫలశ్రుతి)**

కైవల్యోపనిషత్తు శ్రద్ధాభక్తులతో చదివి, దాని సారాంశమును అనుభవించిన సాధకుడు తాను పూర్వశ్రమంలో తెలిసో, తెలియకో గావించిన కృత్యాకృత్యముల నుండి విముక్తుడై, అతని మనస్సు పరమాత్మ తత్త్వములో లయమవుతుంది. శత రుద్రీయము ఎంత ఫలవంతమో కైవల్యోపనిషత్తు కూడా అంతే ఫలితాన్నిస్తుంది అనే విషయాన్ని ఈ శ్లోకం వివరిస్తోంది.

ఒక వ్యక్తి ఎంత గొప్పవాడైనా, ఎంత ఉత్తమ ఆదర్శాలతో ప్రవర్తించినా తన పూర్వాశ్రమంలో అతని మనస్సులోని భావనలు, సంకల్పాలు, తాను చేసిన దుష్కృత కర్మలు జ్ఞప్తికి వచ్చి మనస్సుని కలత పెడతాయి. మానవుడు ఎంత ప్రయత్నించినా ఆ జ్ఞాపకాలు అతనిని వెంటాడుతూనే వుంటాయి. పశ్చాత్తాపము అతనిని కుంగదీస్తుంది. ఆ విధంగా మానసికంగా కఠిన శిక్షను అనుభవిస్తూ చెప్పుకోలేని బాధతో నిస్సహాయుడై వుంటాడు. ఈ వాసనా భారం మోస్తున్నంత వరకూ అతనికి పరమాత్మ తత్త్వం పైన రుచి కలుగదు.

అతని మనస్సుని ఆ బాధ నుండి తప్పించి పరమాత్మవైపుకి మరల్చటానికి మానసిక చికిత్స కావాలి. అటువంటి వ్యక్తి కైవల్యోపనిషత్తులో సూచించిన విధంగా అనుసరించి, కృతార్థుడయ్యే అవకాశాన్ని గురించి బ్రహ్మదేవుడు అశ్వలాయునికి బోధించటం చేత సమర్థులైన సద్గురు మూర్తిని ఆశ్రయించిన సాధకుడు ఎవరైనా తనలో బీజ రూపంగా వున్న వాసనలన్నిటినీ తొలగించుకుని, బంధ విముక్తుడై, పరమాత్మ తత్త్వాన్ని ఆశ్రయించి ఎన్నడూ విడిచిపెట్టని స్థితికి చేరుకుంటాడు. అతడే విముక్తుడు అవుతాడు. అంతేకాదు బ్రహ్మచర్యాది ఆశ్రమాలన్నింటికీ అతీతుడైన నిజమైన సన్యాసి కాషాయాంబరాలను ధారణచేసిన సన్యాసి మాత్రం కాదు. అటువంటి సాధకుడు దేహ మనోబుద్ధులనే ప్రకృతి ఆవరణము నుండి పూర్తిగా విముక్తుడై వైరాగ్య భావనతో జీవించ గలుగుతాడు.

# శ్రీబాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

12-1-1980

శ్రీ బాబూజీ రాత్రి సుమారు 9 గంటల సమయంలో దర్శనం ఇచ్చారు. మేము ఆయనకు పాదసేవ చేసుకుంటున్నాము.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ "ఏమయ్యా! శ్రీ సీతారామాంజనేయ సంవాదంలో విద్యార్థియైన యోగి వినయ, భయభక్తులతో గురుదేవులకు చతుర్విధ శుశ్రూషలు చేసి తరించవచ్చని చెప్పబడింది కదా! చతుర్విధ శుశ్రూషలంటే ఏమిటి? మీరంతా పాపం! పాదసేవ చేసుకొంటున్నారు కదా! ఇదేనా గురుశుశ్రూష అంటే?" అని ప్రశ్నించి "గురుశుశ్రూష అంటే వారి పాదాలు ఒత్తటం కాదయ్యా. మహాత్ములకు దేహదృష్టి ఉంటుందా? వారి మనస్సు ఎక్కడ వుంటుంది? ఆత్మానందంలో ఓలలాడుతూ ఉంటుంది. ఇంక వారికి దేహబాధ వుంటుందా? మహాత్ములకు చేయవలసిన శుశ్రూషలు చతుర్విధములు. అవి అంగ, అర్థ, భావ, ఆత్మ శుశ్రూషలు.



అంగ శుశ్రూష అంటే భక్తుడు తన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము మొదలగు అంతరింద్రియాలు, కర్మేంద్రియాలు చేసే ఏ పనైనా గురుదేవుని సేవగా భావించాలి. అవి ఏ విధి నిర్వహించినా స్వార్థచింతన లేకుండా, ఫలితాన్ని ఆశించకుండా పరమాత్మునికే అర్పించుకుంటున్నాను అనే భావనతో చేయాలి. అదే నిజమైన అంగ శుశ్రూష.

అర్థ శుశ్రూష అంటే, తాను ఆర్జించిన ధనాన్ని దారాపుత్రాదులకు వినియోగించవచ్చు. అలా వినియోగించగా మిగిలిన ధనాన్ని భగవదర్పిత కార్యములకో, పేదవారికో వినియోగించాలి. అంతేగాని మీకున్న ధనాన్నంతా గురుదేవులకు సమర్పించమని కాదు. ధనంతో ప్రేమని

కొనలేము. గురుకృపని ధనంతో సాధించలేము.

భావ శుశ్రూష అంటే గురువే నా దైవము, గురువే నా సర్వస్వము. గురుదేవులు, పరమాత్మ వేరుకాదు. నా గురువును మించిన దైవము వేరొకటి లేదు అనే భావన కలిగి ఉండటమే భావ శుశ్రూష.

ఆత్మ శుశ్రూష అంటే 'సమస్త జీవకోటిని ప్రకాశింపజేసి తాను స్వయంగా ప్రకాశించే ఆత్మ తేజో స్వరూపులే నా గురుదేవులు' అనే భావన కల్గి ఉండటం, అప్పుడు ద్వేషించేది ఏముంది? అప్పుడు సమస్త జీవకోటిని తన గురుదేవులకు భిన్నంగా చూడలేవు. అన్నింటియందు ప్రేమభావం కలుగుతుంది. ఆ ప్రేమయే ఆనందం. అట్టి ఆనంద హృదయ నివాసియే గురుదేవులు. గురుదేవులు తన హృదయ నివాసియైనపుడు తనకి భిన్నంగా ఎక్కడ ఉన్నట్లు? గురుదేవునియందు అట్టి ఆత్మీయత కలిగియుండటమే ఆత్మ శుశ్రూష" అని బోధించారు.



అమెరికాలో ఓహియోలో శ్రీశివ-శ్రీప్రియవారి స్వగృహంలో జులై 1, 2, 3 తారీఖులలో జరిగిన సత్సంగ కార్యక్రమ దృశ్యాలు.



(గత సంచిక తరువాయి) **అమ్మమాట** - జపమాల ప్రసాద

# మనలోకి మనం వెళ్ళి పోవటమే ధ్యానం

క్రిందటిసారి శ్రవణం ఎలా చెయ్యాలో తెలుసుకున్నాము. మరి చక్కగా శ్రవణం చేసిన గురుబోధామృతం మనపై ఎలా పని చేస్తుందో చూద్దాం. మనం ఏదయితే విన్నామో, దాన్ని చక్కగా ఆచరించి అనుభవం లోకి తెచ్చుకున్నప్పుడే విన్నదానికి సార్థకత.



శ్రీబాబూజీ మహరాజ్‌వారు ఎప్పుడూ చెప్పేవారు. అదేమిటంటే, అనపచేనులో పడ్డ ఆవు దానికి కావలసినంత మేతని గబగబా మేసేసి, తిరిగి మందలోకి వెళ్ళకుండా, ఒక చెట్టు క్రింద ఏకాంతంగా పడుకుని తాను తిన్నది చక్కగా నెమరు వేసుకుని, నమిలి మింగుతుంది. ఈ విధంగా నమిలి మ్రింగిన ఆహారం బాగా జీర్ణమయి, రక్తంలోకి వెళ్ళి, రక్తాన్ని శుద్ధి చేసి మంచి పుష్టినిస్తుంది. అదే విధంగా ఆధ్యాత్మిక ఆకలి కలిగిన సాధకుడు గోవులాగ, సత్వగుణ సంపన్నుడై, నిర్మలమైన అంతఃకరణ కలిగివుండాలి. ఆ గోవు చకచకా మేసినట్లు, గురుబోధను ఆవురావురమంటూ శ్రవణం చేయాలి. ఆ విన్న బోధని ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుని మననం చేసుకోవాలి. ఇదే ధ్యానం.

అలా గురుబోధను మననం చేసుకుంటూ వుంటే మనస్సు యొక్క చంచలత్వం ఉడిగి, గురుబోధలో లీనమయ్యి, లయించి తదాకార రూపాన్ని పొందుతుంది. దీనినే 'నిదిధ్యాస' అంటారు. ఇది అనుభవానికేగాని, మాటల ద్వారా అందేదికాదు. అటువంటి అనుభవం కలగాలి అంటే నిర్మలమైన అంతఃకరణ కలిగి వుండాలి. అంతఃకరణ శుద్ధి అయితే గానీ అది సాధ్యం కాదు. అంతఃకరణ అంటే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. మొత్తం మన శరీరంలోని బాహ్యేంద్రియాలకీ అంతరేంద్రియాలకీ మెయిన్ స్విచ్ మన మనస్సే. సకల చరాచర వ్యాపకమైన ఆ దివ్యచరణాలు మనలో ప్రతిబింబించాలంటే మన హృదయము, అంతఃకరణ నిర్మలమై వుండాలి. శెనగ గింజను వేపరసంలో

గాని, పంచదార పానకంలోగాని, ఆవకాయలోగాని వేస్తే దానికి ఆయా రుచులే వచ్చినట్లు, మన మనస్సును కూడా నిరంతరం భగవతత్త్వంలోనే ఊరవేస్తే దానికదే అబ్బుతుంది.

భగవద్గీత, భాగవతము, గురుగీత మన ఇంట్లో ఉన్నాయని చెప్పుకుంటే చాలదు. వాటిని ఎలా ఉపయోగించాలో తెలియాలి. ఏ బోధయితే అందులో చెప్పబడిందో దానిని మెదడులో దాచుకుని, నిరంతర విచారణ చేయాలి. అలా విచారణ చేయగా, చేయగా దానిని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. ఈ విచారణే మనం ధ్యానానికి కూర్చునేసరికి, మన మనస్సులోని అలజడులను రూపుమాపి, ఏకాగ్రతని ప్రసాదిస్తుంది.

ధ్యాన ప్రక్రియ అంటే కళ్ళు మూసుకుని కూర్చోవటం అనుకుంటారు చాలా మంది. పిల్లలకి నేర్పేటప్పుడు అలా కూర్చోవాలనే నేర్పిస్తాము. వాళ్ళకి ఏమీ తెలియకుండానే మనం చెప్పామని కూర్చుంటారు. కానీ, పెద్దవాళ్ళమయిన మనం 'ఇక్కడ ఎందుకు కూర్చున్నాం?' అని మనలను మనం ప్రశ్నించుకోవాలి. **మనలోకి మనం వెళ్ళి పోతున్నాము** అన్నమాట. అదే ధ్యానమంటే. మన యింటికి మనం వెళ్ళటమే ధ్యానమంటే.

స్పీడుగా నామం చేయాలన్నారంటే నామానికి నామానికి మధ్య మనస్సులో సంకల్పం రాకూడదు. నామం ఎంత స్పీడుగా చేస్తున్నామన్నది ముఖ్యం కాదు; అది మన ధ్యేయం కాదు. మనకి క్వాంటిటీ కాదు కావలసినది; క్వాలిటీ ముఖ్యం. అంటే ఎన్ని లక్షలు చేశామని కాదు; ఎంతవరకూ మనసు అందులో లయించింది అన్నదే ముఖ్యం. ముందుగా నామంచేసినా, క్రమంగా మనస్సును గురుదేవుల బోధపైన నిలపాలి.

ఇవన్నీ కుదరాలి, సాధించాలి అంటే నిర్మలాంతఃకరణ కావాలి. అందుకే మనం మహాత్ములకు నమస్కరించినప్పుడు వారు మనలను **'నిర్మలాంతఃకరణ సిద్ధిరస్తు!'** అని ఆశీర్వదిస్తారు.

-సశేషం

# త్రిపురా రహస్యం

(గత సంచిక తరువాయి)

## జ్ఞాన ఖండం

- రమణ ప్రసాద్

శ్రీ దత్తాత్రేయుడి మాటలు విన్నాక పరశురామునికి అవిద్య అనే వలనుండి విడిపడ్డట్టు అనిపించింది. నిష్కపటమైన భక్తితో ఇలా అడిగాడు- "సులభం, సారభూతం, సాక్షాత్తుగా ఫలానిచ్చే విజ్ఞాన సాధనం ఏమిటో, జ్ఞానుల లక్షణం ఏమిటి? వారిని ఎలా గుర్తించవచ్చు? వారు దేహ భావన ఉన్నప్పుడు ఎలా వుంటారు? లేనప్పుడు ఎలా ఉంటాడు? వ్యవహారాలు చేస్తున్నా వాటి యందు ఆసక్తి లేకుండా ఎలా ఉంటాడు? ఈ విషయలు నాకు తెలపండి."అని



దత్తాత్రేయుడు : రామా! జ్ఞాన సాధన రహస్యాన్ని నీకు తెలయజేస్తాను, విను - దేవతానుగ్రహం ముఖ్యమైన జ్ఞాన సాధనం. " ఇతడు నా భక్తుడు. ఇతని కోరిక నేను తప్పక తీరుస్తాను" అని ఆ దేవత వానిని తనవానిగా గ్రహిస్తుంది. త్రికరణ శుద్ధిగా అంతర్యామిగా ఉన్న దేవతను సేవిస్తే, అతనికి సులభంగా జ్ఞానం కలుగుతుంది. ఇదే తత్వరత్వం.

లాభసష్టాలు జయాపజయాలు, మానావమానాలు కలిగినప్పుడు మనస్సు ఏ మాత్రం వికారం పొందనివాడు ఉత్తమజ్ఞాని.

జ్ఞానుల లక్షణం - అపరాధము, కర్మ, కామము అనే వాసనలు లేనివారికి జ్ఞానసిద్ధి కలుగుతుంది. అయినా ఏమీ తెలియనివారివలె ప్రవర్తిస్తారు. జ్ఞానులు ఇతర జ్ఞానులను చూడటంతోనే గుర్తించగలరు.

మందజ్ఞానులు - సోఽహం అనే భావన ఉంటేనే వాసనలు తొలగి దేహాత్మభావన నశిస్తుంది. వారు కాలిన త్రాడులాగా ఉంటారు. పూర్ణ స్వరూపులుగా ఉంటారు.

మధ్యమ శ్రేణి జ్ఞానులు - వారికి దేహ సంబంధం ఉండదు. లోకవ్యవహారం ఉండదు. సుషుప్తిలో ఉన్నవాడేమి మాట్లాడినా , ఏమి చేసినా,వాడికి

తెలియదు. అలాగే మహాయోగికి కూడా ఏమైనా మాట్లాడినా, చేసినా వానికి తెలియదు. దేహం చేసే పనులు నావే అనే అభిమానం ఉండదు. ఉత్తమ, మధ్యమ జ్ఞానుల భేదాలు తెలిపే వృత్తాంతం చెబుతున్నాను, విను -

పూర్వం విపాశా నదీతీరంలో రత్నాంగదుడు అనే రాజు వుండేవాడు.అతనికి రుక్మాంగదుడు, హేమాంగదుడు అనే ఇద్దరు కమారులు ఉన్నారు. రుక్మాంగదుడు సర్వశాస్త్ర పారంగతుడు, హేమాంగదుడు విజ్ఞాని. జ్ఞానులలో ఉత్తముడు. వారిరువురూ సైన్యంతో సహా వేటకు వెళ్ళారు. వేటలో అలసి నదీతీరానికి వెళ్ళారు. ఆ నదికి అవతల ఒడ్డు పై ఉన్న మఱ్ఱిచెట్టుపైన ఒక బ్రహ్మరాక్షసుడు(వసుమంతుడు) వున్నాడు. అతడు విద్వాంసులతో వాదించి, వారిని ఓడించి, వారిని భక్షిస్తాడు. అది తెలిసి అక్కడకతు వెళ్ళిన రుక్మాంగదుడు అతనితో వాదించి ఓడిపోయాడు.

హేమాంగదుడు, “ఆగాగు! నాతో కూడా వాదించి మా ఇద్దరినీ కలసి తిను”అన్నాడు. “సరే నా ప్రశ్నలకు సమాధానం ఇయ్యి” అని బ్రహ్మ రాక్షసుడు ప్రశ్నించటం ప్రారంభించాడు:

-సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఆగష్టు 2018, సెప్టెంబరు 2018 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

ఆగష్టు 2018: AS 5524, 5641, 5644, 7518, 7519, 7520, 7521, 7522, 7523, 7524, LM 4116, LM 4197, LM 4198

సెప్టెంబరు 2018: AS 6750, 6751, 7362, 7365, 7578, 7579, 7582, 7583, 7584, AS 7585, 7586, 7588, 7589, 7592, 7593, 7594, 7598, 7611.

మేనేజరు

# కర్మ – మోక్షము

-మురళి

## (గీతా మకరందము నుండి)

మానవుడు కర్మాచరణము ద్వారా మోక్షసిద్ధిని పొందగలడా? భగవంతుణ్ణి ఆరాధిస్తూ, స్మరిస్తూ, ఈశ్వరార్పణగా కర్మను ఆచరించిన వారు జ్ఞానసిద్ధిని, తద్వారా మోక్షసిద్ధిని పొందగలరు. కర్మను ఈశ్వరార్పణ భావముతో ఆచరిస్తే, చిత్తశుద్ధి కలిగి తద్వారా జ్ఞానము కలిగి మోక్షము సిద్ధిస్తుంది. ఫలాపేక్షతో చేసిన కర్మ మోక్ష హేతువు కాజాలదు. భగవత్ప్రీత్యర్థం కర్మను ఆచరించాలి. అంటే కర్మను ఆచరిస్తూ ఫలాన్ని ఆశించకుండా ఈశ్వరార్పణ బుద్ధితో చేయాలి.

కర్మచే మోక్షం లభిస్తుందా? అని కొందరు ప్రశ్నిస్తారు. తప్పక లభిస్తుంది. కాని కర్మ చేయవలసిన రీతిలో చేస్తేనే లభిస్తుంది. ఆ కర్మను భగవంతునికి అర్పించాలి. నిష్కామ కర్మాచరణ చేయాలి. కర్మ చేయటం వరకే నీ వంతు. ఫలితాన్ని భగవంతునికే అర్పించు. దానివలన కర్మ యందలి దోషము తొలగి, చిత్తశుద్ధి ద్వారా మోక్షసాధనగా అది పరిణమిస్తుంది. కర్మ బంధం తొలగి మోక్ష హేతువుగా మారుతుంది. ఇదే కర్మమార్గమందు కీలకము. కాబట్టి దీని వలన కర్మ నింద్యము కాదు. దాన్ని ఆచరించే పద్ధతిని తెలుసుకున్న యెడల అది తక్కిన భక్తి, జ్ఞానాదుల వలెనే పరమ పవిత్రమైన మోక్షసాధనం కాగలదు. కర్మచే భగవంతుని ఆరాధించే విధానం సరిగా తెలియక మానవులు దైవార్పితంగా కర్మ చేయటం మాని, కామ్యబుద్ధితో చేస్తున్నారు. అందువలనే కర్మ వారికి బంధ రూపముగా మారిపోతున్నది.

తన స్వధర్మము ఆచరించటం కఠినమైననూ అది వదల రాదు. ఈశ్వరార్పణ బుద్ధితో చేసిన మానవులు పాపమును పొందరు. తేలికగా ఆచరించబడే పరుల ధర్మాని కంటె, కష్టతరమైననూ స్వధర్మమే మిన్న. ఇక్కడ స్వధర్మము అనగా ఆత్మకు సంబంధించిన ధర్మమని చెప్పవచ్చు. స్వధర్మము ప్రారంభంలో కించిత్ కష్టమైననూ, చివరకు అది అనంతమైన సౌఖ్యాన్ని కలుగజేస్తుంది. పరధర్మము ప్రారంభంలో సుఖవంతముగా తోచిననూ అది తుదకు పరమ దుఃఖాన్నే కలుగజేస్తుంది. కనుక

పరధర్మము కంటే స్వధర్మమే ఎన్నటికీ మేలైనది.

కర్మ అనేది ఇంద్రియాలచే చేయబడేది కనుక దృశ్యమందు అంతర్భూతమైనది, త్రిగుణాత్మకమైనది, ప్రకృతి (మాయ)యందు వర్తించేది. పొగచే అగ్ని కప్పబడి వున్నట్లుగా సమస్త కర్మలు దృశ్యరూపమగు దోషముచే కప్పబడి వున్నాయి. అయిననూ స్వభావసిద్ధమగు కర్మలను వదలరాదు. ఎందుకనగా వాటిని నిష్కామ బుద్ధితో, భగవదర్పణ బుద్ధితో ఆచరించిన యెడల అవి చిత్తశుద్ధి ద్వారా జ్ఞానమునకు చివరకు మోక్షమును కలుగజేస్తాయి.

పాపకర్మలను మాత్రము చేయరాదు. సమస్త కర్మలు మాయా దోషముచే ఆవరింపబడి వున్నప్పటికీ, అందు శుద్ధకర్మచే అశుద్ధకర్మను, పుణ్యకర్మచే పాపకర్మను, నిష్కామకర్మచే సకామకర్మను తొలగించివేసి, తరువాత క్రమముగా సాధనాతిశయముచేత నైష్కర్మ్యాత్మ రూపముగా చేయవలెను.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2018

06సోమ - శ్రీ గురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

26 ఆది - రాఖీ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

సెప్టెంబర్ 2018

02 ఆది - శ్రీ కృష్ణ జన్మాష్టమి - రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాద పూజ; ఉట్టి కొట్టుట.

05 బుధ - శ్రీగురుదశమి, రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

13- గురు వినాయక చవితి - ఉదయం 11గం.లకు వినాయక పూజ; శ్రీసద్గురుపాదపూజ

24 సోమ - భాద్రపద పౌర్ణమి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.



# శ్రీ బాబు బృందావన ధామము - శ్రీ స్వామి నారాయణ్ అక్షర ధామము



పూజ్య శ్రీ మాతాజీ వారు కొంతమంది వయో వృద్ధులైన శిష్యులను ( సీనియర్ సిటిజన్స్) తమతో ఢిల్లీకు తీసికొని వెళ్ళి వారికి ది. 23-5-2018 (బుధవారం) న స్వామి నారాయణ్ వారి అక్షరధామ్ దర్శనం చేయించారు. స్వామి నారాయణ్ వారి అవతరణము, వారి అకుంఠిత సాధన, వారు బోధించిన ఆధ్యాత్మ తత్త్వము, శ్రీ బాబూజీ మహరాజ్ వారి బాల్యము, వారి సాధన, వారు మానవాళికి అందించిన విశ్వమత తత్త్వబోధనతో ఎన్నో విధాలుగా మేలు కలయిక కలిగి వున్నాయి. మహాత్ములందరూ ఈ కోవకు చెందినవారే. మానవాళిని ఉద్ధరించటమే వారి ఏకైక లక్ష్యం. తమ లక్ష్య సాధనకొరకై తమ జీవితాన్నే పణంగా పెట్టి వారు ఏ త్యాగాన్నైనా చేస్తారు.

**శ్రీబాబూజీమహరాజ్ వారి జీవిత విశేషాలు:**

శ్రీబాబుని 'మీరెవరు?' అని అడిగితే, 'నేను నేనే. మీ బాబును. మీ అందరి మధ్య రావటానికి ఆవిర్భవించాను. నా మాట, నా భావం, నా క్రియ అమ్మ (జగన్మాత) ఆజ్ఞతోను, ఆశీస్సులతో మాత్రమే జరుగుతాయి. కనుక నా సూచనలను విశ్వాసంతో ఆచరించండని చెప్పేవారు.

శ్రీబాబు బాల్యంలోనే మాతా పితరులకు దూరమై, ఇల్లు విడచి, ఈ జగత్తుకు ఆధారము, శాశ్వతము, పరిణామ రహితము అయిన ఏకైక వస్తువును అన్వేషించాలనే ఆవేదనతో దేశ పర్యాటనకు బయల్దేరారు. వారి పర్యటన కాలంలో అగ్ర వర్ణాల దమన నీతికి , దౌర్జన్యానికి బలియై, నిస్సహాయంగా ఆక్రోశిస్తున్న అసంఖ్యాకమైన నిమ్న జాతులవారి ఆక్రందనలు, వారు పడుతున్న పాట్లు శ్రీబాబు దయార్ద్రహృదయాన్ని తీవ్రంగా కలచి వేశాయి. అస్పృశ్యతా భావాన్ని , అసమానతలను తొలగించుకొని సర్వ జీవులు సమ భావముతోను ప్రేమ దృష్టితోను మెలగమని బోధించారు. ఈ విధంగా శ్రీబాబు జీవ రక్షణ దీక్షా కంకణులై మానవకోటి మధ్యకు వచ్చి నిలిచారు.

ఆ రోజులలో శ్రీబాబును 'సిద్ధాంతి'గారని, 'కాళీబాబు' గారని పిలిచేవారు. శ్రీశైల మహా క్షేత్రంలో భద్రాచల సమీపంలో వున్న

పాపికొండలలో ఒక కొండగుహలో వుండి శ్రీబాబు ఎంతోకాలం తపస్సు చేశారు. శ్రీ బాబు తమ పర్యటన కాలంలో అరుణాచలం వెళ్ళి శ్రీ రమణ మహర్షిని దర్శించారు. ఆయన శ్రీబాబు దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకుని,'కుట్టీ! ఇంగె వా అప్పా!' అని తన ప్రక్కనే భోజనానికి కూర్చుండబెట్టుకున్నారు.

శ్రీబాబు పుట్టు పూర్వోత్తరాల గురించి ఇదమిద్ధమని ఎవరికీ తెలియదు. అయినా మనకు తెలిసినంతవరకు వారు ప్రధమంగా, పిఠాపురం,ఉప్పాడ, గుంటూరు, తుని, గ్రామాలలో వెల్లడైనారని తెలుస్తోంది. 1936నాటికే వారిని దర్శించినవారున్నారు. 1940 సంవత్సరం తరువాత యనమదుర్రు, దిరుసుమర్రు, గుండుగొలను గ్రామాలలో అభివ్యక్తమైనారు.

**స్వామినారాయణ్ వారి జీవిత విశేషాలు:**

కౌశల దేశ ప్రాంతంలో, అయోధ్య సమీపంలో, 'ఛపయ్యా' గ్రామంలో (ఉత్తర ప్రదేశ్) స్వామి నారాయణ్ ది.3-4-1781న జన్మించారు. వీరి తలి దండ్రులు ధర్మదేవ్ (హరి ప్రసాద్ పాండే), భక్తి మాత (మూర్తిదేవి). బ్రాహ్మణవంశంలో సర్వారియా అర్చక కులం వారు. ఈ బాలునికి 'ఘనశ్యామ్ పాండే' అని నామకరణం చేశారు. ఇతని అన్నగారి పేరు రామ ప్రతాప్ పాండే. తమ్ముడి పేరు ఇచ్ఛారామ్ పాండే. ఏడు సంవత్సరాలకే ఘనశ్యామ్ సకల శాస్త్ర పారంగతుడై, వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ భారతాలలో నిష్ణాతుడైనాడు. తలి దండ్రుల మరణానంతరం తన ఏడవ ఏట తీర్థయాత్ర ప్రారంభించారు.11వ ఏట 'నీలకంఠ్‌వార్ని' అనే పేరుతో యాత్రలు చేశారు. 1799లో, 9 ఏళ్ళ 11 నెలల యత్రానంతరం 'లోజ్' అనే ఊరిలో(గుజరాత్)లో స్థిరపడ్డారు. 1800లో ఉద్ధవ సాంద్రాయంలో రామానంద స్వామి వద్ద దీక్ష తీసుకున్నారు, రామానందులు ఇతనికి 'సహజానంద' అని నామకరణం చేశారు.1802లో ఉద్ధవ సాంప్రదాయ అధ్యక్ష పదవిని సహజానందకు అప్పగించారు. ఆ తరువాత ఒక సంవత్సరంలోపే వారు పరమ పదించారు. సహజానంద శిష్యులనందరినీ చేరదీసి వారికి 'స్వామి నారాయణ మంత్రాన్ని ఉపదేశించారు. ఉద్ధవ సాంప్రదాయం స్వామి నారాయణ సాంప్రదాయంగా మారింది. అప్పటినుంచి వారు 'స్వామినారాయణ'గా పిలువబడుతూ వచ్చారు.

- సశేషం

## శుభాభినందనలతో ...



INDIGENEOUS anadig MAKE
CAKT-02, CAKT-05, CAKT-06 & TAK-011-03
ENGINE ROOM INSTRUMENTATION FOR EKM SUBMARINE
INDIGENOUS INSTRUMENTS FITTED ON
• INS SINDHUKESRI
• INS SINDHUSHSTRA
• INS SINDHUVIR
• INS SINDHUGHOSH
• INS SINDHURAJ
• INS SINDHUVIJAY
• INS SINDHUKIRTI
anadig systems

# వార్తా లహరి

1-6-18 - ప్రాతఃకాల పూజ అనుష్ఠానం పూర్తి చేసి, శ్రీ మాతాజీ తీర్థ ప్రసాదములను భక్తులకు అందించి, సీతాపూర్ నుండి 8గం.లకు బయలుదేరి దారిలో వున్న గుప్తకాశీ క్షేత్రంలో ప్రకాశిస్తున్న విశ్వేశ్వరుణ్ణి, అమ్మవారిని దర్శించుకుని, అభిషేకించుకుని 11-30గం.లకు బయలుదేరారు.

పాండవులు భారతయుద్ధంలో చేసిన బ్రహ్మహత్యా పాతాకాన్ని రహితం చేసుకోవటం కొరకు పరమశివుని వెదకుతూ వచ్చినప్పుడు, సదాశివుడు ఇక్కడ దాక్కున్నాడట. ఇక్కడ రుద్ర గుండం కూడా వున్నది. పాండవులు వెదుకుతూ ఇక్కడకు కూడా వచ్చారట. అప్పుడు మహాదేవుడు కేదార్ వెళ్ళారుట. రెండు చోట్ల ఒకేమాదిరిగా గుడి వుంది. లోపల దేవుడు కూడా ఒకే మాదిరి. కాకపోతే ఇక్కడ విశ్వేశ్వరుడు మానవుని మాదిరి చిన్న రూపంలో వుంటారు. తిరిగి రుద్రప్రయాగ, దేవ ప్రయాగ, కర్ణప్రయాగ, మీదుగా మాయాపూర్ సాయంత్రం 5గం. లకు శ్రీమాతాజీ చేరుకున్నారు.

2-6-18 ఉదయాన్నే తీర్థ ప్రసాదాలు తీసుకుని శ్రీ మాతాజీవారితో కలసి భక్తులందరూ 5గం.లకు బయలుదేరి మాయాపూర్ నుండి జ్యోషిమఠ్ లో నరసింహస్వామిని దర్శించుకున్నారు. బదరీలోచలికాలంలో 6నెలలు గుడి మూసి వుంటుంది. అప్పుడు ఆ ఆరునెలలు శ్రీ బదరీనాథ్ విశాల్‌ను క్రింద నరసింహస్వామి గుడికి తెచ్చి వుంచి పూజలు చేస్తారు. విష్ణు ప్రయాగ్ మీదుగా బదరీనాథ్ క్షేత్రం 11గం.లకు చేరి శ్రీరామ్ గెస్ట్‌హౌస్‌లో భక్తులు బసచేసారు. అందరూ ఉష్ణగుండంలో స్నానం చేసి, నర నారాయణ స్వామివారి దర్శనం చేసుకున్నారు. కొందరు భక్తులు పితృదేవతలకు బ్రహ్మ కపాలమందు పిండ ప్రదానాలు చేశారు. సాయంత్రం 6-30ని॥ శ్రీ మాతాజీ డోలీలో గుడికి వెళ్ళి బదరీనాథ్ విశాల్, మహాలక్ష్మి అమ్మవారిని దర్శించారు.

3-6-18 శ్రీమాతాజీవారు పూజా అనంతరం భక్తులందరితో 7గం. నుండి 9గం. వరకు శ్రీ కొండూరి రామబ్రహ్మం గారి బ్రహ్మత్వంలో జరిగిన 'శ్రీ లక్ష్మీగణపతి హోమము, శ్రీగురుమూల మంత్ర హోమము, శ్రీ నారాయణ ఉపనిషత్తు, గురుమూల మంత్రము అనుసంధానము చేసిన హోమము, స్వామి అష్టోత్తరము, శ్రీసూక్త హోమములలో

పాల్గొన్నారు. శ్రీమాతాజీవారు భక్తులతో కలసి బదరీక్షేత్రం నుండి 11గం. బయలుదేరి తిరిగి మాయాపూర్ సాయంత్రం 4గం.లకు చేరారు.
4-6-18 శ్రీ మాతాజీవారు భక్తులతో కలసి మాయాపూర్ నుండి 8గం. బయలుదేరి శ్రీధారీదేవిని దర్శించి, సాయంత్రం 5గం. ఋషీకేశ్ చేరారు. భక్తులందరూ గంగాస్నానం చేశారు. స్వామిని అభిషేకించారు. మాతాజీకి సుస్తీగా వుండటం చేత ఆ రాత్రి డా॥ నారాయణ ప్రసాద్ ఇంట్లో వున్నారు.
5-6-18 ఉదయం అక్కడ నుండి బయలుదేరి డెహరాడూన్ ఎయిర్ పోర్ట్ నుండి ప్లెయిన్‌లో హైదరాబాద్ రాత్రి 7-30 కు చేరారు. డాక్టర్లు వచ్చి చూసి అమ్మను కిమ్స్ ఆసుపత్రిలో ఎడ్మిట్ చేసి, టెస్ట్‌లు చేసి సివియర్ న్యుమోనియా అని డయాగ్నోజ్ చేసి ట్రీట్‌మెంట్ మొదలు పెట్టారు.

యాత్రలో భక్తులందరూ కబీర్ ఆశ్రమంలో హోమం చేసి, పూర్ణాహుతి చేశారు. అనంతరం ఋషీకేశ్‌లోని ఆశ్రమాలు, లక్ష్మణ్ ఝూలా, ఇతర ముఖ్య ప్రదేశాలను దర్శించి, రాత్రికి బయలుదేరి 6-6-18 ఉదయం ఢిల్లీకి చేరారు. అక్కడ శ్రీమతి రాజ్యలక్ష్మి, కుమారుడు చాణుక్య శ్రీసుబ్రహ్మణ్యంగారు గురుసాయుజ్యం పొందిన మొదటి వార్షిక ఆరాధన చేసుకుని భక్తులందరికీ మహాప్రసాద వితరణ చేశారు. ఆ రాత్రికి బయలుదేరి 7-6-18 రాత్రి12-30ని॥లకు విజయవాడ చేరుకున్నారు. అక్కడి నుండి బస్సులలో శ్రీకాళీవనాశ్రమము నంబూరుకు చేరుకున్నారు.
8-6-18 ఉదయం గోపూజ, యాగశాల ప్రవేశము, మండపారాధన చేసుకుని భక్తులు అందరి గోత్రనామాలతో విఘ్నేశ్వర పూజ, మహాన్యాసం చేసుకుని, శ్రీబృందావనం స్వామి సన్నిధిలో శ్రీ సద్గురుపాదుకలకు శ్రీరుద్ర నమక చమకాలతో అభిషేకం చేసుకున్నారు. తిరిగి శ్రీరామలింగేశ్వర స్వామికి కూడా అభిషేకించుకుని, తదనంతరం సుమారు 100మంది యువత సూర్య నమస్కారాలు చేశారు. తిరిగి 11గం. యాగశాలలో హోమం గావించి, యాత్రకు వెళ్ళిన భక్తుల మండల దీక్షకు పూర్ణాహుతి జరిపించారు.

భక్తులందరూ శ్రీ సద్గురుదేవుల పరిపూర్ణ అనుగ్రహంతో మాత్రమే యాత్ర అంతా దివ్యంగా పూర్తి చేసుకుని రాగలిగామని శ్రీ స్వామిని కొనియాడారు.
15-6-18 న హైదరాబాదు నుండి శ్రీ మాతాజీ నంబూరు చేరారు.
19-6-18 న శ్రీ మాతాజీ సాయంత్రం విమానంలో విశాఖపట్నం రాత్రి

8గం.లకు జేరి కిమ్స్ ఆసుపత్రిలో వున్న శ్రీ ఆనంద్‌గారిని చూసి వారికి తమ ఆశీస్సులను అందజేశారు. ఆ రాత్రి సీతారామరాజుగారింట్లో బస చేశారు.

20-6-18 ప్రాతఃకాల పూజానంతరం శ్రీమాతాజీ తిరిగి ఆనంద్‌గారి ఆరోగ్యాన్ని పరామర్శించి మధ్యాహ్నం విమానంలో బయలుదేరి సాయంత్రం 4-30ని॥లకు హైదరాబాద్ బ్రాంచికి చేరుకున్నారు.

22-6-18 రాత్రి తె.జా1-15ని॥ బయలుదేరి విమానాశ్రయానికి వెళ్ళి, అక్కడ 4-35ని॥ విమానంలో అమెరికా వెళ్ళారు. సాయంత్రం 3-30ని॥ చికాగో చేరుకున్నారు. అక్కడ శ్రీరామరాజుగారింట్లో బస చేశారు.

23-6-18 మాతాజీ పూజ చేసి అందరికీ తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. శ్రీరామ రాజు, నీలిమ దంపతులు శ్రీసద్గురుపాదపూజ చేసుకున్నారు. ప్రార్థన సంకీర్తన అనంతరం మహాప్రసాద వితరణ జరిగినది.

24-6-18 శ్రీమాతాజీ పూజ, తీర్థ ప్రసాదాలు తరువాత 9గం.లకు బయలుదేరి చికాగో నుండి 11గం. షాంపైన్ చేరారు. (శ్రీబాబూజీ మహరాజ్ వారు 1982, 1984, 1988లో అమెరికా వచ్చినప్పుడు డా॥ సుంకర ప్రసాద్‌గారింట్లోనే ఉండేవారు. శ్రీస్వామి బోధలతో, సంకీర్తనలతో సంత్సంగాలతో ఈ ప్రదేశం ఎంతో పునీతమైనది. స్వామివారు వాడిన వస్తువులు, విశ్రాంతి తీసుకున్న గది అలాగే వుంచి, శ్రీప్రసాద్‌గారి దంపతులు ధ్యానం చేసుకుంటూ వుంటారు). ఆ సాయంత్రం 5గం.లకు బయలుదేరి సెయింట్‌లూయిస్ రాత్రి 8గం.లకు చేరారు. 25. 26 తేదీలలో కూడా అక్కడే ఉండి అక్కడి భక్తులకు దర్శనమిచ్చారు.

27-6-18 ఉదయం 9-30గం. బయలుదేరి ఇండియానాపోలీస్ మధ్యాహ్నం 3గం. చేరారు. తిరిగి 5గం.లకు బయలుదేరి ఓహియో లోని కొలంబస్ రాత్రి 9గం.లకు చేరుకున్నారు. 28. 29 తేదీలలో అక్కడి భక్తులతో ప్రార్థనాది కార్యక్రమాలు చేయించారు.

30-6-18 మావులేటి ప్రసాద్‌రాజుగారి నూతన స్వగృహంలో శ్రీ హనుమాన్‌చాలీసా పారాయణ, సద్గురు పాదపూజ, ప్రసాదవితరణ చేశారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి శ్రీ శివకుమార్, శ్రీప్రియ గృహానికి చేరుకున్నారు. ఆ సాయంత్రం అక్కడ ప్రార్థన సంకీర్తన ప్రవచనం జరిగాయి. ఇతర ప్రదేశాల నుండి భక్తులు అక్కడికి చేరారు.

# ఏకమేవ అద్వితీయం బ్రహ్మ

- బాబు. ఎమ్.

మణిద్వీపంలో పరదేవత అయిన జగన్మాత బ్రహ్మ, హరి, రుద్రులకు సృష్టి, స్థితి, లయ శక్తులను యిస్తూ వారితో 'నాలో నుంచి ఉద్భవించిన శక్తులు, నేనే అన్నిట వున్నాను అని తెలుసుకుని, ఎవరు నన్ను ఆశ్రయిస్తారో, మరియు నేనే వారిలో వున్న ఆత్మ వస్తువును అని తెలుసుకుంటారో వారిని నేనే అనుగ్రహిస్తాను' అని చెప్పింది.

శివాజీ మహారాజ్ వారికి కాళీమాత ఒకసారి స్వప్నంలో కనిపించి 'సమర్థ రామదాస్ సాక్షాత్తు ఆంజనేయుని అంశ, ఆయనను శరణువేడి ఆయనకు శిష్యుడవై మంత్రోపదేశం పొందు' అని ఆజ్ఞాపించింది.

శివాజీమహరాజ్ అలాగే ఆయనను కలుసుకుని మంత్రోపదేశం తీసుకున్నాడు. ఆ తరువాత సమర్థ రామదాస్ సూక్ష్మంగా ఆత్మానాత్మ వివేకాన్ని గురించి చెప్పి. ఆత్మతత్త్వం గురించి కొద్దిసేపట్లో, కొద్దిమాటలలో చెప్పారు. అది 'లఘుబోధ' గా ప్రసిద్ధికెక్కింది. దాని సారాంశమే ఇది.

పంచ మహాభూతాలలో ఈ పృథ్వి ఒకటి. ఈ పంచ మహాభూతాలు అనాదికాలంగా వస్తున్నాయి. అవి చాలా పురాతనమైనవి. ఇవాళ్టికి వున్నాయంటే అవి శాశ్వతంగా కనిపిస్తాయి. కాని నిజానికి అవి శాశ్వతం కావు. భూమిని గురించి ఆలోచిస్తే చూడు శివాజీ! అందులో ఎన్నో మార్పులు వచ్చాయి. జ్వాలాముఖి ఏర్పడినప్పుడు అక్కడి పర్వతాలు, లోయలుగా మారాయి. లోయలు పర్వతాలుగా మారాయి. లేని నదులు ఏర్పడ్డాయి. ఉన్న నదులు పూడిపోయి అక్కడ పర్వతాలు ఏర్పడ్డాయి.

అలాగే వేరే భూతాల గురించి విడివిడిగా ఆలోచించు. నీరు వేడి తగలగానే ఆవిరిగా మారుతుంది. మళ్ళీ చల్లని గాలి తగలగానే అది నీరుగా మారి వర్షిస్తుంది. అదే నీరు ఇంకాస్త చలిగాలి తగిలేసరికి గడ్డగా మారుతుంది. దీనిబట్టి ఈ నీరు అనే భూతం కూడా శాశ్వతం కాదు. మార్పులు, నాశనం, పుట్టుక కలిగి వుంది. ఇక తేజస్సు అంటావా! సూర్యుడు కూడా ఉదయిస్తాడు, అస్తమిస్తాడు. ఇక వాయువు అంటావా! చలికాలంలో వద్దు అనిపించి, ఎండాకాలంలో కావాలి కావాలి

అనిపిస్తుంది. అప్పుడు కావాలన్నా అది దొరకదు. విసనకఱ్ఱతో విసురుకోవలసి వస్తుంది. కావున ఈ వాయువు ఇవాళ వుండి, ఇవాళ వీచి, రేపు స్థంభిస్తుంది. ఇక ఆకాశం వున్నా లేనట్లే. లేకపోయినా అది వున్నట్లు. 'ఆకాశం' అని పిలుస్తాము.

ఇలా ఈ పంచ మహాభూతాలు అనేక మార్పులు, వికారాలు కలిగి వుంటూ, ఉద్భవిస్తూ, నశిస్తూ వుంటాయి. ఇవి అనిత్యములు. అయినా నిత్యంగా భాసిస్తాయి. కాని ఇవి మారుతున్నా వీటికి ఆధారమైన వస్తువు అది ఎన్నటికీ మారక, ఏ వికారాలు లేకుండా వుంటుంది. అది నిన్న లేక ఇవాళ వుండేది కాదు. రేపు మళ్ళీ లేకపోయేది కాదు. త్రికాలములలో శాశ్వతంగా వుండేది ఆ ఆత్మవస్తువు.

ఇప్పుడు నీ సంగతే చూడు. బాల్యంలో నీ శరీరం ఎలా వుండేది? పాల పళ్ళతో నిగనిగలాడే నీ బుగ్గలపై ఇవాళ గడ్డాలు, మీసాలు. చిన్నప్పుడు ఆటపాటలలో లీనమైన నీ మనస్సు ఇప్పుడు ఎంత మార్పు చెందినదో. రేపు వృద్ధాప్యం వచ్చినప్పుడు ఈ పచ్చని వర్ఛస్సు ముడతలు పడి, భార్య కూడా అసహ్యించుకునేలాగ అవుతుంది. కానీ వీటన్నిటినీ ప్రకాశింపజేస్తూ, తనలో ఏ మార్పులేకుండా వుండే వస్తువు వుంది. అదే ఆత్మవస్తువు. దానిని పొందాలంటే అది చాలా కష్టతరం.

సత్సాంగత్యం, గురుసేవ, నిరంతరం హరినామ స్మరణ ఇలాంటివి చేయాలి. అప్పుడు వారి అనుగ్రహం ద్వారా శాశ్వతమైన ఆత్మవస్తువు మనదవుతుంది. ఇక అక్కడ జన్మలేదు, మృత్యువు లేదు, సుఖము లేదు, దుఃఖము లేదు. అంతా ఒక్కటే. నీవు నేను తనపర భేదం లేదు. అంతా నేనే అన్న భావన కలుగుతుంది. అది శాశ్వతం.

ఈ ఆత్మ నిర్గుణ నిరాకారమయింది. అనిత్యమైన ఈ పంచ మహాభూతాలతో నిర్మాణమయింది ఈ దేహం. ఈ దేహము, ఇంద్రియాలు స్వయం శక్తి లేనివి. అవి స్వయం ప్రకాశం లేనివి. అవి పరావలంబన కలవి. ఉదాహరణకు శ్వాస ఉన్నంతవరకూ ఈ దేహం నిలబడతుంది. ఈ శ్వాస పోతే ఇది ప్రేత అవుతుంది. ఇది చలనం లేకుండా అయిపోతుంది.

అట్టి ఆత్మ వస్తువును నిరంతరం స్మరించాలి. ఈ ఆత్మ వస్తువు గురించి అహర్నిశలు, నిదిధ్యాసలతో వుండాలి. అవి లేనిదే యోగము కలుగదు. నిత్యానిత్యవివేకము కలిగి, ఈ ఆత్మ వస్తువును ఎవరు తెలుసుకుంటారో, దర్శించుకుంటారో, అనుభవిస్తారో వారు ధన్యులు!

అట్టివారినే శ్రేష్ఠ పురుషులు, సమర్థులు, మహాత్ములు అంటారు.

ప్రతి మానవుడు తన ధర్మం నెరవేర్చాలి. స్వధర్మం పట్ల విముఖత కలిగి వుండరాదు. పరధర్మం ఎంత మంచిదయినా సరే, స్వధర్మానికి తిలోదకాలిచ్చి దాన్ని ఆచరించకూడదు. గురుదేవుడు ఇచ్చిన ఆజ్ఞను అనుసరించి, ఆయన ఇచ్చిన లక్ష్యార్థాన్ని నెరవేర్చుకోవాలి. అంతేకాని ఆయన ఆజ్ఞకు భిన్నంగా ప్రవర్తిస్తే అది అనర్థాలకు దారితీస్తుంది.

నన్ను చూడాలని తీవ్రంగా అనిపించినప్పుడు నీవు స్మరించినంతనే నేను నీకు దర్శనమిస్తాను. కాబట్టి నిరంతరం గురునామం జపిస్తూ, గురురూపాన్ని స్మరిస్తూ వుండు. ఈశ్వర కృప కలిగి మోహం నశించాక కూడా అర్జునుడు తన కర్తవ్యాన్ని విస్మరించలేదు. ఆ విధంగా అర్జునుడిలాగా నడచుకోవాలి" అని తమ బోధను ముగించారు సమర్థులు.



అమెరికా ఓహియోలో శ్రీశివ-శ్రీప్రియవారి స్వగృహంలో జులై 1, 2, 3 తారీఖులలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమములో పాల్గొన్న బాలబాలికలు



అమెరికా ఓహియోలో శ్రీశివ-శ్రీప్రియవారి స్వగృహంలో జులై 1, 2, 3 తారీఖులలో జరిగిన సత్సంగానికి విచ్చేసిన భక్తబృందం

# శ్రీ కృష్ణ కర్ణామృతము

(గత సంచిక తరువాయి) - సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 61 వ శ్లో॥**

**కాళిన్దీ పులినోదరేషు ముసలి యావద్గతః ఖేలితుం**
**తావత్కార్పరికం పయః పిబహరే వర్ధిష్యతే తేశిఖా**
**ఇత్థం బాలతయా ప్రతారణ పరాః శుత్వా యశోదాగిరః**
**పాయాన్నస్స్వశిఖాం స్పృశన్ ప్రముదితః క్షీరేర్ధపీతే హరిః**

తాత్పర్యము -



యమునా తీరమందు బలరామ కృష్ణులిద్దరూ ఆడుకోవటానికి వెళ్ళారు. మధ్యలో శ్రీకృష్ణుడు ఇంటికి వచ్చి పాలుతాగుతానని అంటే తల్లి యశోద గిన్నెలో పాలుపోసి యిచ్చి 'ఈ పాలన్నిటినీ త్రాగేసెయ్యి. నీ జుట్టు పొడవుగా పెరుగుతుంది' అని చెప్పగా, గోపాలుడు తల్లిమాటలు విని సగం పాలు తాగి తన జడ పొడవు పెరిగిందేమోనని తడిమి చూసుకుంటున్న ఆ చిన్నారి కన్నయ్య మమ్ములను రక్షించుగాక!!

1. భగవంతుడు మనకు రెండు చేతులిచ్చాడు. ఎందుకంటే ఒక చెయ్యి మన పనులు చేసికునేందుకు, రెండవది పరులకు సహాయపడేటందుకు.
2. ఆనందానికి మించిన ఆరోగ్యం లేదు, సంతోషానికి మించిన సంపద లేదు, సేవకు మించిన మార్గం లేదు.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## శిఖిధ్వజుని కథ

"నేను" ను నశించే యీ శరీరంగా భావించటమే, యీ జగత్తులో బంధానికి మూలకారణము. కాని "నేను" సర్వ వ్యాపకమైన ఆత్మ లేక బ్రహ్మమనే దృఢమైన విశ్వాసము మానవులను యీ జగత్తులో బంధము నుండి విముక్తి నిస్తుంది. తల్లి ఊయలలో పరుండి వున్న తన బిడ్డను చూడక, తన బిడ్డ తప్పిపోయిందని కలత చెంది ఊయలలో తప్ప, అన్నిచోట్ల వెదకినట్లు, మానవాళి తమలో నిక్షిప్తమైన ఆనందాన్ని విస్మరించి, బాహ్యంగా వున్న నశించే వస్తువులలో, ఆనందం కోసం వెదకి, వ్యధకు లోనౌతారు, సముద్రములో నీరు తరంగముల వల్ల చలించినట్లు మనసు అసంఖ్యాకమైన సంకల్పములతో చలించి, కలత చెందుతుంది. 'ఓ రాజా, మీరు సంకల్పములను విచ్ఛిన్నం చేసుకొని, మనసు నాత్మయందు కేంద్రీకరిస్తే, మీరు నిరుపమానమైన శాంతిని, నిత్యానందమునునుభవిస్తారు. అప్పుడు మీరు సంసారమనే భయంకర సాగరములో, వుద్రుతమైన తరంగముల మధ్య కదలికలేకుండ, స్థిరంగా వుంటారు.



"మాయాభరితమైన యీ ప్రపంచము బ్రహ్మమునుండే వచ్చింది, మాయ అంతు పట్టని అద్భుతము. అది మానవులను ఆత్మ సాక్షాత్కారము పొందకుండ, మోసగిస్తుంది. మాయ యొక్క ప్రభావము వలన, యీ ప్రపంచము స్థిరమైన వాస్తవంగా గోచరిస్తుంది, ఈ విశ్వములో ఆత్మ జ్ఞానము లేని వారు దుఃఖానికి లోనౌతారు. ఎవరైతే యీ జగత్తును మనసనే తెరపై చిత్రింపబడిన రంగుల చిత్రంగా భావిస్తారో, వారికి దేనిపైనా ఆకర్షణ కాని, కోరిక గాని వుండవు, వారు నిత్య సంతృప్తి యనే అవిచ్ఛన్న కవచమును ధరించినవారు. ఎవరైతే ఎలాంటి సంపద, సహకారములేక పోయినా, తన్ను తాను తెలుసుకొనుట వలన (ఆత్మసాక్షాత్కారము), అతనికి లేనిదంటూ యేమిలేదు (సత్యమైన, నిత్యమైన సంపన్నుడు) అన్ని కోరికలను నిర్మూలంచేసుకొని, బ్రహ్మమునందే దృష్టి కేంద్రీకరించి, జీవన్ముక్తుడవుతాడు.

"అవాస్తవమైన స్వల్పమైన నేనును అంతము చేయి. నిన్ను నీవు అశాశ్వతమై, నశించే శరీరమని భావించకు. నీవు సర్వవ్యాపకమైన పరమాత్మను గ్రహించు, ఆ భావాన్ని (వునికి లేనిది) పెంపొందించుకో, అన్ని వస్తువులకు రూపరహితమైన స్వచ్ఛమైన యెరుకగా గ్రహించి, ధ్యానించు. "ఇది ఆనందకరమైనది, యిది బాధాకరమైనది, యిది మంచిదా,

చెడ్డదా” యనే భావము, బాధల పరంపరకు బీజము. ఈ బీజాన్ని సమాహిత దృష్టి లేక దృక్పధమనే అగ్నిలో దహిస్తే యిక బాధలకు తావెక్కడది? కృషి చేసి, అభావమనే ఖడ్గాన్ని ధరించు. అంగీకారమైనది, అనంగీకారమైనదనే భావన, ప్రేమ, ద్వేషమనే వుద్రిక్తమైన భావాలను సమతుల్య దృష్టియనే గొడ్డలితో నరికివేయి.

“యజ్ఞ, యాగాదులనే కర్మకాండతో కూడిన దట్టమైన అరణ్యాన్ని, కర్మ యొక్క సత్ఫలితము, దుష్ఫలితముల పట్ల నిర్వేదమనే పనిముట్టుతో ఛేదించి, శుభ్రపరచు. అభావమనే ఖడ్గముతో అన్ని సంకల్పాలను, విషయాలను ధ్వంసము చేయి. నీ మనసు నుండి విభేదాలను, భేద దృష్టిని పారద్రోలు. నిత్యా నిత్య వివేకమును పెంపొందించుకో. ఎలాంటి వొడుదుడుకులు లేకుండా ప్రశాంతంగా వుండు. ఈ ప్రపంచమునకు సంబంధించిన చింతలు, భయాలను పారద్రోలి స్వేచ్ఛగా వుండు, ఎవరైతే స్వల్పమైన నేను (అవాస్తవమనే)ను కోరికలను, సంకల్పాలను విధ్యంసము చేసి, మాయా జనితమైన విభేదాలను రహితం చేసుకొంటాడో, బ్రహ్మము యొక్క నిత్యమైన దివ్యానందమును జుర్రుకొంటాడు. అట్టివాడన్ని బాధల నుండి, చింతలనుండి విముక్తుడు, కనుక ఓ రాజా! నిరంతరము సంపూర్ణమై, నిర్మలమై, మచ్చలేని, మాయలేని, అందరిలో సమానంగా వుండే వరమాత్మపై దృష్టి కేంద్రీకరించి ధ్యానించు.

మనువు కొనసాగించాడు ‘జ్ఞానములో యేడు స్థాయిలు లేక ఏడు జ్ఞాన భూమికలు వున్నవి. మొదటి స్థాయిలో ఆత్మజ్ఞాన శాస్త్రములను ప్రగాఢమైన అధ్యయనము వలన, సత్పురుషుల సాంగత్యము వలన యెలాంటి ఫలితాన్ని ఆశించకుండా, సత్కార్యములను చేయుట వలన, జ్ఞానమును పెంపొందించకొనవలెను. శుభేచ్ఛ లేక మంచి కోరిక జ్ఞానములో మొదటి భూమికగా రూపొందుతుంది, మనసనే నేత్రమును వివేచనా శక్తియనే నీటితో నింపి, దానిని రక్షించాలి, ఈ స్థాయిలో పంచేంద్రియముల (జ్ఞానేంద్రియముల) నాకర్షించే విషయముల పట్ల నిరాసక్తత, విముఖత వుంటాయి.

శుభేచ్ఛ తర్వాత రెండవ స్థాయి విచారణ. నిరంతరము ఆత్మ విచారణ చేయటమే రెండవ భూమిక, తను మానసి యన్నది మూడవ భూమిక. వస్తువుల పట్ల ప్రత్యేకమైన విముఖతనభ్యాసము చేయుట వలన, యీ స్థాయిని చేరుకోగలరు. మనసు దారంలాగా పల్చనవుతుంది, ‘తను’ అంటే దారము అని అర్థము. అది మనసు యొక్క దారములాంటి స్థితిని సూచిస్తుంది, ఈ మూడవ భూమికకు ‘అసంగ భావన’ యనే పేరుకూడ వున్నది. ఈ మూడవ స్థాయిలో సాధకుడు అన్ని రకాల ఆకర్షణల నుండి విముక్తుడు. ఎవరైనా, యీ మూడవ భూమికలో మరణిస్తే అతను స్వర్గములో చాలా కాలముండి, తిరిగి భూమి మీద జ్ఞానిగా జన్మిస్తాడు. పైన చెప్పిన యీ మూడు భూమికలు జాగ్రదవస్థలోనివి.

-సశేషం

# జీవిత అనుభవం

- గాలి జగదీష్

ఒక వృద్ధ మహాత్మునితో ఒక గృహస్థుడు మాట్లాడుతూ, "స్వామీ! మీ జీవితంలో సారవంతమైన అనుభవం ఏమిటి?" అని అడిగాడు. దానికి ఆయన సమాధానం చెబుతూ "చూడు బాబూ! ఇదే నా జీవితంలో సారవంతమైన అనుభవం....." అంటూ నోరు తెరచి చూపించాడు. లోపల పళ్ళు లేవు. నాలుకను గుండ్రంగా తిప్పాడు.

అది చూసిన గృహస్థుడు "స్వామీ! నాకేమీ అర్థం కాలేదు. కాస్త వివరంగా తెలియజేయండి" అన్నాడు. దానికి ఆ మహాత్ముడు "చూడు బాబూ! పళ్ళు గట్టివి. పెళుసువి కాబట్టి ఊడిపోయాయి. కానీ మెత్తగా వుండే నాలుక మటుకు అలాగే వుండిపోయింది.

గట్టిగా (అహంకారంతో) వుండేవాడు పోతాడు. దేహమే నేను అని భ్రమించి అహంకారంతో విర్రవీగేవాడు నశించిపోతాడు. ఈ ప్రాపంచిక విషయాదుల పట్ల ఆసక్తిలేనివాడు, భక్తి, ఈశ్వర ఆరాధన, ఈశ్వరప్రేమ కలిగినవాడు చివరిదాకా నిలిచి వుంటాడు. వాడు శాశ్వతమైన స్థానాన్ని పొందుతాడు. ఇదే నా అనుభవం" అని వివరించాడు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2018

06 సోమవారం - శ్రీగురుదశమి - సాయంత్రం 5-30గం॥లకు, శ్రీ సద్గురుపాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

26 ఆదివారం - రాఖీ పౌర్ణమి, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

సెప్టెంబర్ 2018

02 ఆదివారం - శ్రీ కృష్ణ జన్మాష్టమి - ఉదయం 11 గం॥లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

05 బుధవారం - శ్రీ గురు దశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

13 గురువారం - వినాయక చవితి - సాయంత్రం 5-30గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

17 నుండి 23 వరకు వార్షిక సత్సంగ సమావేశములు.

24 సోమవారం - భాద్రపద పౌర్ణమి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

# శ్రీ సద్గురుదేవులతో చార్‌ధామ్ యాత్ర

(21-5- 2018 నుండి 7-6-2018 వరకు)

-జగన్నాథ ప్రసాద్

"ప్రవహించే నదులు సర్వదేవతా స్వరూపాల నిలయాలు" అన్నది వేదవాక్కు. అవి ఎన్నో వేల సంవత్సరాలనుండి ముని పుంగవులు సంచరించిన స్థలాలు. వారు ఆ నది పరిసరాలలో ఆశ్రమాలు ఏర్పర్చుకొని తపస్సు చేసేవారు. ఆ నదిని ఆనుకొనిఎన్నో ప్రసిద్ధ దేవాలయాలు వెలిశాయి. అటువంటి ప్రదేశాలలో జ్ఞాన తరంగాలు వ్యాప్తమై ఉంటాయి. శ్రీబాబూజీ మహరాజ్ వారు ఆ పవిత్ర స్థలాలకు భక్తులను తీసుకొని వెళ్ళి వారిచేత నదీ స్నానాలు చేయించి ఆలయ దర్శనాలు చేయించేవారు. ఈ సంవత్సరం మే, జూన్ నెలలలో శ్రీచంద్ర కాళీ ప్రసాద మతాజీ వారు సుమారు 150 మంది భక్తులతో ఈ యాత్ర చేయించారు.

"శ్రీ గురుదేవులతో తీర్థయాత్ర!" ఎంత మహద్భాగ్యం! పైగా వారు మన వెన్నంటే ఉండి ఈ యాత్ర చేయించి, భక్తులందరి రక్షణ భారం వారే వహించి ఈ యాత్రను సఫలీకృతం చేశారు. పసిబిడ్డను తల్లి ఎత్తుకున్నాక వాడికిక భయం ఉంటుందా?

ప్రథమ దర్శనం ఢిల్లీ సమీపంలోని 'అక్షరథామ్' -7 సంవత్సరముల పిన్న వయస్సులోనే సత్యాన్వేషణకై ఇల్లు వదిలి అనేక సాధనలు చేసి 'శ్రీ స్వామినారాయణ్'గా పేరుగాంచిన వారి మందిరం అది. వారి చరిత్ర, బోధలు, సేవలు, అక్కడి అనేక ప్రదర్శనలద్వారా చూస్తుంటే ఒళ్ళు పులకరిస్తుంది. వారి ముందు మనం ఎంత అల్పులమో అనిపిస్తుంది. మనం చెయ్యవలసింది, ఆచరించవలసింది చాలా ఉందనిపిస్తుంది. అందుకు కావలసినది, మనస్సు, విశ్వాసం, దీక్ష. 'నువ్వు నావైపు ఒక్క అడుగు వెయ్యి, నేను నీ వైపు పది అడుగులు వేసి నిన్ను నడిపించుకుంటాను' అని భగవంతుడు అంటాడు" అని శ్రీబాబూజీ మహారాజ్ వారు అనేక సార్లు చెప్పారు. అది వినటంతోనే సరిపోదు. ఆచరణలో చూపాలి. "ప్రక్కవాడిని ప్రేమించు, దీనులను సేవించు" అని మహాత్ములు చెప్పారు. మహాత్ముల చరిత్రలు చూస్తే, భక్తులను తరింపజేయటానికి చాలా పరితపించారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని తెలుస్తుంది.

**హరిద్వార్** : ఇక్కడ గంగ చాలా చల్లగా ఉంటుంది. అక్కడ ప్రధానమైనది దక్షుడు యజ్ఞం చేసిన 'దక్ష యజ్ఞకుండం', సతీదేవి అగ్ని ప్రవేశం చేసిన 'సతీకుండం', కొండపైన 'మా చండీదేవి ఆలయం'ఉంది. గంగా తీరాన శ్రీమాతాజీవారి సన్నిధిలో 'ప్రార్థన' జరుగుతుంటే, ఆ ప్రాంతం వారందరూ వచ్చి ప్రార్థనలో పాలొన్నారు. భక్తికి భాష, ప్రాంతము అవరోధము కావు కదా! అనిపించింది.

**యమునోత్రి:** యమునోత్రి నుండి 'బార్‌కోట్'కు తిరిగి వస్తుండగా మా ముందు ఉన్న బస్సు పైన మండుతున్న పెద్ద చెట్టు పడింది. శ్రీ గురుదేవుల కృప వలన మేమంతా క్షేమంగా బయట పడ్డాము. అదే శ్రీ గురుదేవుల రక్షణ అంటే! 'విశ్వసించు, తరించు' అనే శ్రీబాబూజీ వారి మాటలు గుర్తుకొచ్చాయి. గంగోత్రిలో నీరుకూడా అయిసు గడ్డలాగా చల్లగా ఉంది. 'మా మనస్సులు నిష్కల్మషంగా, చల్లగా వుంటాయి. మీ మానవులే కుళ్ళుతో, కుతంత్రాలతో మీ మనస్సులను కలుషితం చేసుకుంటున్నారు' అని అంటునట్లుగా అనిపిస్తుంది.

**కేదార్‌నాథ్ :** ఇక్కడి శివుని రూపంలో ప్రత్యేకత ఉంది. మనకు తెలిసిన లింగాకార రూపంలో కాకుండా ఎగుడు దిగుడుగా ఉన్న నల్లరాయి రూపంలో ఉంటుంది. 'రూపం ప్రధానం కాదు రా! అన్నిట్లో ఉన్న పరమాత్మను దర్శించు' అని మహాత్ములు చెప్పారు కదా! జగద్గురువు శ్రీ ఆది శంకరాచార్యులవారు బదరీనాథ్ నుండి కేదారనాథ్ వచ్చి శివుని దర్శనం చేసికొన్నారు. వారు అక్కడ ఒక ద్వారం నిర్మించారు. వారు హిమాలయాలలో ప్రవేశించి అంతర్థానమైనారు. తరువాత కాలంలో వారికి అక్కడ ఒక ఆలయం నిర్మించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్నదని 2013 సం ॥ లో శంకరాచార్యులవారు నిర్మించిన ద్వారాన్ని తొలగించారు. ఆ కారణంగానే ఆ సంవత్సరంలో 'అలక్‌నంద' నదిలో ఉధృతంగా వరద వచ్చి చాలా జన నష్టమైంది అని అక్కడి ప్రజల నమ్మకం. శ్రీ శంకరాచార్యుల వారి ఆలయంకూడా కొట్టుకుపోయింది. కాని శివాలయానికి ఎటువంటి నష్టమూ జరుగలేదు. కేదార్‌నాథ్‌కు 'బేస్‌క్యాంప్' అయిన 'సీతాపూర్'లో 'ప్రయాగ్ నారాయణ' ఉంది. అది హిమవంతుని ఒకప్పటి రాజధాని. శివ పార్వతుల వివాహం శ్రీమన్నారాయణుడి ఆధ్వర్యంలో జరిగింది కనుక ఆ ప్రాంతానికి 'నారాయణ' అని, అప్పటి హోమగుండం మూడు యుగాలనుండి ఇప్పటికీ వెలుగుతోంది కాబట్టి 'త్రియుగ్ నారాయణ్' అని ఈ ప్రాంతానికి పేరు వచ్చింది. సీతాపూర్ దగ్గర 'గుప్తకాశి' ఉంది. ఇక్కడ పాండవులు శివుని దర్శనానికై వెళ్ళగా, శివుడు ఇక్కడ దాగాడట. అందుకని ఈ ప్రదేశానికి 'గుప్తకాశి'అని పేరు వచ్చింది. మందాకిని, అలక్‌నందల సంగమ స్థానానికి 'రుద్ర ప్రయాగ' అని పేరు.

**బదరీనాథ్ :** బదరీనారాయణుడిని ఎంత సేపు చూసినా తనివి తీరదు. ఋషీకేశ్ వెళ్ళేదారిలో 'శ్రీధారీదేవి' అమ్మవారి ఆలయం ఉంది. ఇది గంగానదిలో నిర్మింపబడింది. ఋషీకేశ్, శతఘ్నీ ఘాట్‌లో సాయంత్రం జరిగిన గంగామాత హారతి కార్యక్రమంలో పాల్గొన్నాము.

కష్టమైనా ఇష్టంగా చేస్తే ఏ నష్టమూ ఉండదు. శ్రీ గురుదేవులతో జరిగిన యాత్ర కాబట్టి మా యోగక్షేమాల బాధ్యత వారే వహించి చార్‌ధామ్ యాత్ర లోని అన్ని విశేషాలను చూపించి అందరినీ క్షేమంగా ఆశ్రమానికి చేర్చారు. ధన్యోస్మి!

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

ఆగస్ట్ 2018

06 సోమ - శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

10 శుక్ర - మాస శివరాత్రి, పావులూరులో ఏకాహం

11 శని - అమావాస్య

14 మంగ - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

24 శుక్ర - వరలక్ష్మీ వ్రతము.

26 ఆది - రాఖీ పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన

సెప్టెంబర్ 2018

02 ఆది - శ్రీ కృష్ణ జన్మాష్ఠమి - ఉదయం కలశ స్థాపన; శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన; భక్త సమారాధన; రాత్రి 7గం।లకు శ్రీ సద్గురు పాద పూజ.

03 సోమ - ఉదయం 11గం।లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

04 మంగళ - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

05 బుధ - శ్రీ గురు దశమి, టీచర్స్ డే - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, రాత్రి 7 గం॥లకు ఉట్టి కొట్టుట.

05 బుధవారం నుండి 11 మంగళవారం వరకు మౌనధ్యాన సప్తాహ శిబిరం.

08 శని - మాస శివరాత్రి. , పావులూరు శాఖలో ఏకాహం.

09 ఆది - అమావాస్య.

13 గురువారం - వినాయక చవితి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు సామూహిక వినాయక పూజలు, భక్తసమారాధన.

24 సోమ - భాద్రపద పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

మానవుడు తన జీవిత కాలంలో తాను అనుభవించదగిన మార్గము శ్రేయస్సా? ప్రేయస్సా? ఈ రెండిటిలో ఏదో ఒకటి అనుభవించక తప్పదు. అయితే అత్యధిక సంఖ్యలో మానవులు తమకు అత్యంత ప్రియమైన ప్రాపంచిక వ్యవహారాలలో ప్రేయస్సు మార్గాన్నే ఎన్నుకుంటారు. అది వారికి తాత్కాలిక ఆనందాన్నిస్తుంది. అంతేకాదు ఆ మార్గంలో ప్రయాణించటం అతి సులభం. దానిని అనుసరించడానికి ఏ గ్రంథాలు చదవనవసరం లేదు. ఎవరినీ ఆశ్రయించవలసిన అవసరం అంతకన్నా లేదు. అది మానవుని మనస్సుకు నచ్చిన మార్గం. అయితే మానవుడు ప్రేయస్సు మార్గాన్ని ఎంపిక చేయటానికి గల ప్రధాన కారణం అతనిలో పేరుకు పోయిన జన్మజన్మాంతరాల వాసనలు, గుణాల ప్రేరణ, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు మనస్సు స్పందించటం. వీటి ప్రభావం చేత మానవుడి అంతఃకరణ అశుద్ధమై అతనిలో వక్ర ఆలోచనలు, ఈర్ష్య, అసూయ, రాగ ద్వేషాల ప్రభావానికి లోనై వుంటాడు.



నిర్మలాంతఃకరణ సాధించనివాడు శ్రేయో మార్గాన్ని ఎన్నడూ ఎంపిక చేయలేడు. అతనిలో వివేకము, ఆత్మవిచారణ, క్రమశిక్షణ లోపించటమే కారణం. బాహ్య ప్రపంచంలో పరిసరాల ప్రభావానికి గురైన మానవుడు తప్పక వక్రమార్గంలోనే నడుస్తాడు. అటువంటి వ్యక్తి క్రమ శిక్షణ. తన స్వేచ్ఛా జీవితానికి అవరోధంగా భావిస్తాడు. అందువలన అతని మనస్సుకి ఆధ్యాత్మిక చింతన రుచికరించదు.

శ్రేయో మార్గము ఆనందదాయకమైనది. పరిణామ రహితమైనది. అక్కడ ద్వైతానికి తావులేదు. ఈర్ష్య, అసూయ, రాగ ద్వేషాలు వుండవు. అది శాశ్వతానంద స్థితి. అయితే మానవుడు ఆ మార్గంలో పయనించడానికి ప్రథమంలో కొంత క్రమశిక్షణ కొన్ని నియమాలను అనుసరించవలసి వుంటుంది. వీటికి తోడుగా ఆధ్యాత్మిక చింతన చేయటానికి ఆ శ్రేయోమార్గానుభూతిని పొందిన

అనుభవజ్ఞుడైన మార్గదర్శకుడు ఆవశ్యం. శ్రేయో మార్గాన్ని అనుసరించిన వ్యక్తి ప్రథమంలో కొన్ని అవరోధాలకు గురియైనా క్రమంగా శ్రేయస్సులో వున్న ఆనందాన్ని అందుకోగలుగుతాడు. అయితే శ్రేయో మార్గాన్ని అనుసరించిన మానవుడు బలవంతంగా తన ఇంద్రియాలను నిగ్రహించటం వలన కొన్ని ఇబ్బందులకు గురికాక తప్పదు. ఇంద్రియాలను ఎప్పుడూ బలవంతంగా నిగ్రహించరాదు. ఇంద్రియ సంయమనాన్ని సాధించాలి.

ఇంద్రియాలను ధర్మబద్ధంగా అవసరార్థం వినియోగించాలి. అందువలన శ్రేయోమార్గాన్ని అనుసరించే వ్యక్తి ఆ విధానంలోని సాధకబాధకాలను అధిగమించి విజయుడవ్వాలంటే సమర్థుడైన సద్గురు మూర్తి మార్గదర్శకత్వం అవశ్యము. ఆయన తన బోధ ద్వారా సాధకుని సక్రమమైన మార్గంలో నడిపించి, అవరోధాలను ఎదుర్కొనే సూచనలను అందజేస్తాడు.

శ్రేయో మార్గంలో పయనించిన కొద్దీ, ప్రాపంచిక వ్యవహారాల యందు విముక్తత కలిగి, నీచ భావాలకు దూరమవుతాడు. అయితే మానవుడు చివరి వరకు చిత్తశుద్ధితో తగు ప్రయత్నం చేయాలి. మానవుడి మనస్సు విషయానందానికి తేలికగా దాస్యం చేస్తుంది.

అయినా ప్రేయస్సులో మానవుడికి సుఖదుఃఖాలు, నిందాస్తుతులు తప్పవు కదా! అందువలన ఆ వ్యథకు తట్టుకోలేక ఎప్పటికైనా శ్రేయోమార్గాన్ని ఎంపిక చేయక తప్పదు. అదే అతని జీవిత ధ్యేయం.

1. సమస్త తప్పిదాలకు కారణం మనసు. దాన్ని సరిగా వుంచుకుంటే ఎప్పటికీ తప్పు చేయవు.
2. మందలో ఒకరిగా వుండకు. వందలో ఒకరిగా వుండటానికి ప్రయత్నించు.
3. మహాపురుషులు అనగా కామక్రోధలోభమోహమదమాత్సర్యాలనే అరిషడ్వర్గాలను జయించినవారు.
4. బలమే జీవనం. బలహీనమే మరణం.

## శుభాభినందనలతో ...


Grand
RADIATORS
AN ISO 9001:2008 CERTIFIED COMPANY

Manufactures of Radiators (Automobile and Industrial), Oil Coolers, Air Coolers, After Coolers, Inter Coolers, Finned Tube Coolers, Shell and Tube Heat Exchngers,Tube Bundles,Condernsers,Cooling Coils,All Pre-Heaters, Large After Coolers and Mechanically Bonded Radiators











# GRAND RADIATORS

PLOT NO 131, BLOCK – D, AUTONAGAR,
VISAKHAPATNM-530012.AP, INDIA
TELPHONE: 0891-2517706, 2564538, FAX NO. 0891-2513660, 2502640
E-mail: grandradiator@yahoo.in Website: www.grandradiators.com

# ఆధ్యాత్మికం - సోషలిజం

- పాలూరి కాళీప్రసాద్

కొంతమంది **'చాతుర్వర్ణం మయా సృష్టం'** అనే గీతా వాక్యాన్ని వుటంకించి, భగవంతునికే భేదభావం అంటకట్టి, ఆ సాకుతో ఇతరులను నీచంగా చూస్తారు. కానీ అదే భగవద్గీతలో ఎన్నో సందర్భాలలో సమానత్వాన్ని గీతాచార్యుడు ప్రబోధించిన విషయాన్ని వీరు పట్టించుకోరు.

**'విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని శుని చైవ స్వపాకేచ పండితాః సమదర్శనః'** అనే గీతా వాక్యం ద్వారా - విద్యా వినయ సంపద గలిగిన బ్రాహ్మణుని యందు, గోవు యందు, ఏనుగునందు, కుక్క యందు, ఆ కుక్క మాంసం వండుకు తినేవాని యందు పండితుడైన వాడు సమదృష్టిని కలిగి వుంటాడని శ్రీకృష్ణ భగవానుడు నొక్కి వక్కాణిస్తున్నాడు. ఇలా సమాజంలో విభిన్న స్థాయిలలో వున్నవారినే కాక, అనేక ఇతర రకములైన ప్రాణులను కూడా సమాన దృష్టితో చూసేవాడే పండితుడు.

ఇక **'సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్య బంధుషు సాధుష్వపిచ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే'** అనే శ్లోకం ద్వారా - స్నేహితులు, మిత్రులు, శత్రువులు, నిన్ను పట్టించుకోనివారు, మిత్రులు శత్రువులు కాక మధ్యస్థంగా వుండేవారు, నిన్ను ద్వేషించేవారు, బంధువులు, సాధువులు, పాపులు ..... ఇలా అన్ని రకాల మనోభావాలు, సంబంధాలు వున్నవారి పట్ల సమభావం కలిగి వుండటమే విశేష లక్షణంగా వర్ణించబడినది. ఇంకా 'సమత్వం యోగం ఉచ్యతే' - సమత్వమే యోగము అని చెప్పబడినది.

వివేకచూడామణిలోని **'జాతి నీతి కుల గోత్ర దూరగం, నామ రూప గుణదోష వర్జితం, దేశకాల విషయాతి వర్తియత్ బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని'** అనే శ్లోకాన్ని శ్రీగురుదేవులు బాబూజీ మహరాజ్‌వారు తరచుగా ప్రస్తావిస్తూ వుండేవారు. అలాగే ఆధ్యాత్మికాన్ని మించిన సోషలిజం ఎక్కడా లేదని కూడా చెప్పేవారు.

సృష్టిలోని సమస్త జీవులలో, వస్తువులలో తానే నిండి వున్నానని విభూతియోగంలో గీతాచార్యుడు బోధించినప్పుడు అర్జునుడు ఆ విశ్వ రూపాన్ని దర్శించాలని ఆకాంక్షించాడు. అప్పుడు శ్రీకృష్ణ భగవానుడు 'అయితే, ఇదిగో నా విశ్వరూపాన్ని చూడు' అన్నాడు. కానీ అర్జునుడికి

ఏమీ కనిపించలేదు. అప్పుడు భగవానుడే కరుణించి, 'నీ యీ చర్మ చక్షువులతో నా విశ్వరూపాన్ని దర్శించలేవు. ఇదిగో నీకు దివ్య చక్షువులను ప్రసాదిస్తున్నాను. వాటితో నా విశ్వరూపాన్ని దర్శించు' అని చెప్పి, దివ్యదృష్టిని ప్రసాదించి, తన విశ్వరూపాన్ని దర్శింపజేశాడు. అప్పుడు అర్జునుడికి అప్పటివరకూ తన ఎదుట వున్న కృష్ణుడు, చుట్టూ వున్న సైన్యం, ఇంకా విశ్వంలో వున్న సమస్త ప్రాణులు, ఆఖరికి తనతో సహా మొత్తం ఆ విశ్వరూపంలో కనిపించారు.

ఈ సందర్భంలో **'సర్వభూత స్థమాత్మానం, సర్వభూతనిచాత్మని ఈక్షతే యోగ యుక్తాత్మా సర్వత్ర సమదర్శనః'** - సమదర్శనుడైన యోగి సర్వ ప్రాణులలో ఉన్నది తానేనని, తనలోనే సర్వప్రాణులు ఉన్నాయని ఆత్మజ్ఞానంతో దర్శించగలుగుతాడని తెలిపే గీతావాక్యానికి అర్థంగా నిలిచాడు అర్జునుడు. అయితే ఇక్కడ కృష్ణుడు అంతకు ముందు మామూలుగా వుండి అప్పుడే విశ్వరూపాన్ని ధరించాడా? అంటే 'కాదు' అనే సమాధానం వస్తుంది. ఆయన ఎప్పుడూ మార్పు లేకుండా విశ్వరూప స్థితిలోనే వున్నాడు. ఇక్కడ మారినది అర్జునుని 'దృష్టి' మాత్రమే.

ఇలా మన దృష్టిని ఆధ్యాత్మికంగా మార్చుకోగలిగిన నాడు, ఆశ్రమ నిత్యప్రార్థనలో భాగమైన 'మానవునికి మానవునికి మధ్య భేద బుద్ధి నశించి, సర్వజీవులు సమభావముతోనూ, ప్రేమదృష్టితోనూ మెలగుదురు గాక! లోకములన్నియూ శాంతి సౌఖ్యములతో వర్ధిల్లును గాక!' అనే వాక్యాలు నిత్యసత్యములుగా నిలుస్తాయి. ఇంతకంటే సోషలిజం ఎక్కడ ఉంటుంది?

1. చక్కగా హాయిగా నవ్వితే గుండె వేగం పెరిగి రక్త ప్రసరణం బాగుంటుంది. చిన్న వయస్సులో రోజుకు 300సార్లు, యుక్త వయస్సులో రోజుకు 47సార్లు, వృద్ధాప్యంలో రోజుకు 20సార్లు నవ్వాలి.
2. గలగలా నవ్వటం వలన జ్ఞాపక శక్తి పెరుగుతుంది. ధైర్యగుణం వస్తుంది. రక్తపోటు తగ్గుతుంది. చక్కెరవ్యాధికి నవ్వు చక్కని మందు.

# సోऽహం

- పరాశర ప్రసాద్

**'హంస శివ సోऽహం'** అనేది సూచన మంత్రం. సాధన చతుష్టయ సంపత్తి సాధించిన సాధకునికి సద్గురుదేవులు తారక మంత్రాన్ని ఉపదేశిస్తారు. సాధకుడు సద్గురుదేవుల ఆదేశానుసారం లక్ష్యార్థ సాధన చేయగా చేయగా అంతఃకరణ నిర్మలమై, మనస్సు అంతర్ముఖమై బ్రహ్మమును గూర్చిన విచారణ చేస్తూ సర్వవ్యాపకుడైన బ్రహ్మమును దర్శించాలనే ఆవేదన తీవ్రతరమవుతుంది. అప్పుడు సద్గురు మూర్తి పరమానుగ్రహంతో సూచన మంత్రాన్ని ఉపదేశించటం జరుగుతుంది.

**'హంస శివ సోऽహం'** అనేది సూచన మంత్రం. హంస ఏ విధంగా పాలను నీళ్లను వేరు చేస్తుందో అలాగే సత్యాసత్యవివేకమును సాధించగల హంసవు నీవే అని తెలియజేసే సూచన మంత్రం ద్వారా సద్గురుమూర్తి సాధకునికి ఎరుక పరుస్తారు. మంగళ స్వరూపుడైన ఆ పరబ్రహ్మవు నేవీ అని తెలియజేసేదే సూచన మంత్రం. తారక యోగం, సాంఖ్యయోగం సాధించిన సాధకుడు అమనస్కయోగాన్ని సాధించాలి. సద్గురుమూర్తి అందించే బోధా శ్రవణము ద్వారా తాను హంసను ఎలా అయ్యాను అనే విచారణకు ఉపక్రమిస్తే, శ్రవణము చేసిన బోధ మననానికి వస్తుంది. మననం చేయగా చేయగా **'సోऽహం'** అనే అనుభూతి కలుగుతుంది.

హంస **శివసోऽహం** అనేది స్మరణ చేసే మంత్రం కాదు. అది కేవలం అనుభూతి. సాధన పటిష్టంగా కొనసాగించే సాధకుని హృదయంలో సాధన ధ్యేయం ఏదైతే వుందో అది తానే అని సద్గురు మూర్తి పరమానుగ్రహంతో గుర్తించగలగటమే సాక్షాత్కారము. మానవుడు జన్మించినది మొదలు అంతిమ శ్వాస విడిచేవరకు అతనిలో మూలాధారం నుండి సహస్రారం వరకు సంచరించే తేజస్సే **'సోऽహం'**. అది తన ఉనికిని తెలిపే సంకేతం. అదే తాను. ఈ దేహేంద్రియాదులను నడిపించేది ఆతేజస్సే సుమా!

**సోऽహం** అనే హంస అఖండ తేజస్సుతో ప్రజ్వరిల్లుతూ నిర్విరామంగా సుషుమ్నా నాడిలో సంచరిస్తూ వుంటుంది. దీనిని అనుభవ పూర్వకంగా గుర్తించగలగాలి. కొంతమంది మనస్సుని నిగ్రహించడానికి ప్రాణాయామ ప్రక్రియని అనుసరిస్తారు.

ప్రాణాయామ ప్రక్రియలో రేచకము, పూరకము, కుంభకము అనేవి వుంటాయి. ప్రాణవాయువును లోనికి తీసుకోవడం పూరకము.

**లోనికి తీసుకున్న వాయువు కొన్ని క్షణాలు లోపల నిలిపి వుంచటము కుంభకము. లోపల నిలిపి వుంచిన వాయువును బయటకు వదలటమే రేచక ప్రకియగా భావించబడుతుంది.**

**అయితే ఈ ప్రాణాయామ ప్రక్రియను సద్గురుమూర్తి శిక్షణలోనే అనుసరించాలి. అలాకాని పక్షంలో ప్రమాదం సంభవించవచ్చు అని గురుదేవులు హెచ్చరించేవారు. ప్రాణాయామ ప్రక్రియ ద్వారా శారీరిక సంరక్షణ జరుగవచ్చుగాని, మానసిక పరివర్తనకుగాని, సోऽహం భావన లేక అనుభూతిని పొందటానికి గాని తోడ్పడదు.**

---

S.H.K.V.P.B గురుకులం (స్కూల్) పూర్వ విద్యార్థులకు విన్నపం

ప్రియమైన విద్యార్థులారా!

మనం జీవితంలో ఎంత అభివృద్ధి సాధించినా మన మూలాలను మనం మరచిపోకూడదు కదా! మన వ్యక్తిగత అభివృద్ధిలో పాఠశాల ఎంతో ముఖ్యమైన భూమిక పోషించిందన్న విషయం మీకు అందరికీ గుర్తు వుండే వుంటుంది. మరి మన ఆశ్రమ పాఠశాల ఒక లాభాపేక్ష లేని సంస్థ, కేవలం విద్యార్థులు చెల్లించే అతి తక్కువ రుసుముతో నడుస్తోందని మీకూ తెలుసు. మన పాఠశాల ముఖ్యంగా పేద, దిగువ, మధ్య తరగతి వర్గాలవారి పిల్లలను అభివృద్ధి పథంలో నడిపించటానికై శ్రీబాబూజీ మహరాజ్‌వారిచే స్థాపించబడినది.

కాని నేటి ఆధునిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ పొంది తమ జీవితాలను మెరుగు పరచుకోవాలని కలలుకనే విద్యార్థుల ఆశలు నెరవేర్చాలంటే పాఠశాలను, ఇక్కడి బోధనా పద్ధతులను కూడా ఆధునీకరించవలసిన అవసరం ఎంతైనా వుంది. అందుకై వారు విశాఖపట్నం, హైదరాబాదుకు చెందిన ప్రముఖ విద్యావేత్తలతో అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు.

ఇందుకై మన గురుకుల పూర్వ విద్యార్థులు కొందరు ఒక సంఘముగా ఏర్పడి ఏడాదికి కనీసం 1000 రూ॥లు విరాళం ఇస్తున్నారు. ఇప్పుడు ఈ సంఘంలోనికి అందరు పూర్వ విద్యార్థులకూ అవకాశం కల్పించాలని నిర్ణయించడమైనది. మనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల ఋణం ఎప్పటికీ తీర్చుకోలేనిదే అయినా, కేవలం ఏడాదికి వెయ్యి రూపాయల కనీస విరాళంతో మీరు ఎంతోమంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపగలుగుతారు.

ఈ మహదాశయంలో ఆసక్తి కలిగిన పూర్వవిద్యార్థుల కొరకు మేము ఒక వాట్సాప్ గ్రూప్ నడుపుతున్నాము. అందులో మన పాఠశాల ప్రగతికి సంబంధించిన విశేషాలు ఎప్పటికప్పుడు ప్రచురింప బడతాయి. మీకు విరాళం ఇవ్వడానికిగాని, ఈ గ్రూప్‌లో చేరటానికిగాని ఆసక్తి వున్నట్లయితే దయచేసి ఈ క్రింద వ్యక్తులను సంప్రదించగలరు!

పాలూరి కాళీప్రసాద్ - 94936 62848, వంకిన బాబు - 93900 90750

(గత సంచిక తరువాయి) **కైవల్యోపనిషత్** - రేఖ

ఈ ఉపనిషత్తుకి కొంతమంది 'ఓం సహనావవతు....' అన్న శాంతి మంత్రం చెబుతారు. మరికొంతమంది 'ఓం భద్రం కర్ణేభిః ...' అన్న శాంతి మంత్రం చెబుతారు. మనం ఈ రెంటి గురించీ చెప్పుకుందాం.

**ఓం సహనావవతు । సహనౌ భునక్తు।**
**సహవీర్యం కరవావహై । తేజస్వినావధీత మస్తు।**
**మా విద్విషావహై ॥ ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

ఓం, అనేది శబ్దానికే మూలమైనది. అది అ-ఉ-మ అనే అక్షరాలతో కూడుకుని వుంది ఓం అనే శబ్దం. అకారం బ్రహ్మరూపం, ఉకారం విష్ణురూపం, మకారం మహేశ్వర రూపం. ఈ మూడు శక్తులూ కూడా ప్రణవ స్వరూపుడయిన ఆ పరబ్రహ్మములో నుండి ఉద్భవించినవే. బ్రహ్మ సృష్టికర్త, విష్ణువు స్థితికర్త, మహేశ్వరుడు లయకర్త.

ఏ మంత్రానికయినా 'ఓం' శిరస్సు వంటిదని మహాత్ములు చెబుతారు. ఎవరయినా సరే వర్ణభేదం, లింగభేదం లేకుండా ఓంకారోపాసన, శాస్త్రాధ్యయనం చేయవచ్చు. శ్రద్ధ కలిగి వుండటం చాలా అవసరం. శ్రద్ధ లేకపోతే అర్థమవదు సరికదా ఉచ్చారణ, శాస్త్రాధ్యయనం చేయడానికి కూడా యోగ్యత లేదు. శ్రద్ధ వున్న చోట ఈ ఉపాసన చేయటానికి మనని ఎవరూ నిరోధించలేరు.

**ఓం సహనావవతు** -

ఓంకారం సర్వానికి ఆధారమైన, సర్వ వ్యాపకమైన నిరాకార నిర్గుణ పరమాత్మ (భగవంతుడు=గురుదేవుడు) మనలను (గురుశిష్యులిద్దరినీ) రక్షించుగాక! అని గురువు కూడా శిష్యుడితో పాటుగా వుండి, విషయాదుల వలన కలిగే ఆటంకాల నుండి రక్షించమని ప్రార్థిస్తున్నారు. అప్పుడే మనసు ప్రశాంతమై, బుద్ధి సూక్ష్మమై గురువు చెప్పే జ్ఞానం సూటిగా అందుతుంది.

**సహనౌ భునక్తు** -

మేమిద్దరమూ అనుభవించి, ఆనందించెదము గాక! (అంటే గురుశిష్యులిద్దరూ).

**సహవీర్యం కరవావహై** - ఇరువురమూ కలసి ఈ ఆధ్యాత్మిక విద్యను

అభ్యసించటంలో (సోమరితనము, అలసత్వం లేకుండా) శ్రద్ధతో శ్రమించెదము గాక.

**తేజస్వినావధీతమస్తు -** మా యొక్క అర్థం చేసుకునే శక్తి తేజోవంతము అగుగాక.

**మా విద్విషావహై -** మా ఇద్దరి మధ్య ద్వేషము లేకుండుగాక. కానిశక్తులు మా మీద పడకుండా, ఇతర భావన లేకుండా, మేమిద్దరమూ ఎప్పుడూ ఒకే భావన కలిగి, ఒక్కటిగానే వుందుము గాక - అని గురుశిష్యులిద్దరూ ప్రార్థిస్తున్నారు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః -** అని మూడుసార్లు ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక విఘ్నాలు కలుగకుండా రక్షించమని వారు ప్రార్థిస్తున్నారు.

**ఆధి దైవికం -** అంటే పిడుగులు, వర్షాలు మొ॥గు వాటివలన కలిగే తాపాలు, విఘ్నాలు.

**ఆధి భౌతికం** - అంటే ఇతర మానవుల వల్ల, జంతువుల వలన కలిగే తాపాలు, విఘ్నాలు.

**ఆధ్యాత్మికం -** అంటే మనసుకి సంబంధించిన సంకల్ప వికల్పాలు, ఇంద్రియాల వలన, వాసనల వలన కలిగే విఘ్నాలు, తాపాలు

పైన చెప్పిన తాపాలన్నీ శాంతించాలని గురుశిష్యులిద్దరూ ప్రార్థిస్తున్నారు.

-సశేషం

**1. మనం సుఖంగా ఉండాలంటే, ఇతరులను సుఖపెట్టగలగాలి.**

**2. వంద మాటలు చెప్పటం కంటే, ఒక మంచిపని చేయటం మంచిది.**

**3. నీతులు బోధించటం కాదు, ఆచరణలో పెట్టటం మంచిది.**

**4. మహాత్ములు సుఖాన్ని అందరికీ పంచిపెడతారు, కష్టాన్ని తమలోనే దాచుకుంటారు. పరమశివుడు చంద్రుణ్ణి అందరికీ కనిపించేలాగా తలపైన ధరించాడు, గరళాన్ని తన కంఠంలో నిక్షిప్తం చేశాడు.**

**- బి. భారతి**

శుభాభినందనలతో ...



VennTech
Manufacturer of
Ventilation System /
Air Handling Equipments
for Marine applications
PRODUCTS :
Blowers
ATU'S
Coolers
Moisture Separaters
Heat Exchangers
PLOT NO: 1-125/17/A, MIE, HAFEEZPET, MIYAPUR, HYDERABAD – 500 049.
MOBILE: 9000410044, TEL : 040 – 64100589, FAX:040-23116650
E-MAIL: VENNTEC@GMAIL.COM

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## బళ్ళారి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

1950లో శాస్త్రిగారి పెద్దకుమారుడనైన నా (రచయిత) వివాహం జరిగింది. 1952లో నాభార్య కళ్యాణికి తీవ్రమైన గ్రహబాధ సంభవించింది. అంతు తెలియని మానసిక వ్యాధి రూపంలో అది ఆమెను చాలా బాధించింది. ప్రసిద్ధులైన భూతవైద్యులకు కూడా ఆ భూతం లొంగలేదు. ఒక గోసాయి వచ్చి కొంత ఉపశాంతి కలిగించాడు. కాని బాధ మళ్ళీ మొదలై మరింత తీవ్రరూపం దాల్చింది.



భూతములు కూడా, తమకు ముక్తి ప్రసాదించే మహాత్ముని కోసం వేచి ఉంటాయి. ఆ మహాత్ముని దృష్టిలో తాము పడవలెనంటే ఎవరిని ఆవేశించాలో గమనించి, వాళ్ళనే ఆవేశిస్తాయి. అందువలన ఆ భూతానికి, అది ఆవేశించిన వ్యక్తికి కూడా ఆ మహాత్ముని ద్వారా ముక్తి కలుగుతుంది. ఆ విధంగా గ్రహ బాధ కలగటం కూడా వుభయతారకమైన ఘటనమే అవుతుంది. ఇందిర విషయంలో ఇలాగే జరిగింది కదా! అలాగే కళ్యాణి విషయంలోనూ జరిగింది.

అప్పట్లో నేను యెమ్. యస్. సి చదువు కోసం విశాఖ పట్టణంలో ఉన్నాను. శాస్త్రిగారు బళ్ళారిలో ఉన్నారు. శ్రీబాబు తత్త్వజ్ఞులని తెలుసు గాని, ఇటువంటి గ్రహ బాధలను నివారించటంలో కూడా ప్రవీణులని శాస్త్రిగారికి తెలియదు. అన్ని ప్రయత్నాలూ విఫలమైన తరువాత, తుంగభద్రా నదీ తీరంలో మంత్రాలయు క్షేత్రంలో సజీవ సమాధిస్థితులై, మహామహిమాన్వితులై ఉన్న శ్రీరాఘవేంద్రస్వామి వారి సన్నిధికి శాస్త్రిగారు, నన్ను కళ్యాణిని తీసుకుని వెళ్ళారు. అక్కడ మేము ఉభయ సంధ్యలయందు తుంగభద్రా నదీ స్నానము, శ్రీ రాఘవేంద్రస్వామి వారి సజీవ సమాధియైన బృందావనమునకు ప్రదక్షిణములు, శ్రీస్వామివారి పాదతీర్థ సేవనము ఒక మండలం దీక్షగా పూర్తి చేశాము.

సరిగ్గా 41వ నాటి రాత్రి శాస్త్రిగారికి, శ్రీరాఘవేంద్రస్వామి

శిష్యసమేతులై తుంగభద్రా నదీ తీరంలో విహరిస్తున్నట్లు స్వప్నదర్శనమిచ్చి "నీ కుమారుడు, కోడలు ఆచరించిన దీక్ష సఫలమైనది. నీ కోడలికి అచిర కాలంలోనే స్వస్థత కలుగుతుంది. శ్రీబాబుకు నాకు భేదము లేదు. ఇక నుండి మీ కోడలి ఆరోగ్యము, మీ కుటుంబ సభ్యులందరి యోగ క్షేమములు శ్రీబాబు చూసుకుంటారు. వారిని నిరంతరము భక్తివిశ్వాసములతో సేవించుకోవటం వలన మీకు సర్వ శుభములు చేకూర గలవు" అని శెలవు ప్రసాదించారు.

ఈ స్వప్న దర్శనం ద్వారా, శ్రీ రాఘవేంద్రస్వామికి, శ్రీబాబుకు రూప భేదమే గాని తత్త్వత: ఉన్న వస్తువు ఒకటేనని, శ్రీబాబు ఇహ పరములలో కూడా శాంతి సౌభాగ్యములను ప్రసాదించగల సర్వ సమర్థులని శాస్త్రిగారు గ్రహించగలిగారు. శ్రీబాబు అనుగ్రహం వలన కళ్యాణికి స్వస్థత చేకూరింది.

శాస్త్రిగారు బళ్ళారిలో ఉన్నందువలనను, ఉద్యోగ బాధ్యతల వలనను శ్రీబాబును తరచుగా దర్శించుకోవటానికి అవకాశం దొరికేది కాదు. ఏమాత్రం వీలు కలిగినా, శ్రీబాబు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్ళి దర్శనం చేసుకొనే వారు. లేదా శాస్త్రిగారు ఎక్కడ ఉంటే అక్కడికి శ్రీబాబు వెళ్ళేవారు. బళ్ళారిలో శాస్త్రిగారు ఉన్న పది పన్నెండు సంవత్సరాలలో శ్రీబాబు కనీసం పది సార్లయినా బళ్ళారి వెళ్ళి శాస్త్రిగారికి , కుటుంబ సభ్యులకు తమ దర్శనమును అనుగ్రహించారు.

ఒకసారి శ్రీబాబు ఆలపాడులో చుక్కమ్మగారి వద్ద ఉన్నారని తెలిసి, శాస్త్రిగారు ఆలపాడు వెళ్ళారు. అక్కడ శ్రీబాబుతో కొన్ని రోజులు గడిపే అవకాశం వారికి లభించింది. ఒక రోజున శ్రీబాబు శాస్త్రిగారితో సాయంకాల వ్యాహ్యాళికి వెళ్ళి తిరిగి వస్తున్నారు. మాటల మధ్యలో శాస్త్రిగారిని ఆపి, శ్రీబాబు "మీరు తక్షణం మంచి ఋత్విక్కులను ఏర్పాటు చేసి ఒక మండలం రోజులపాటు మహన్యాస పూర్వక రుద్రాభిషేకము, సహస్ర లింగార్చన చేయించండి. నవగ్రహ శాంతి కోసం 62,000 జపము, దశాంశ క్షీర తర్పణము, తద్దశాంశ హోమము చేయించండి" అన్నారు. శాస్త్రిగారు 'ఎందుకోసం?' అని అడిగారు. శ్రీబాబు "ఆ విషయం యిప్పుడు చెప్పను. తరువాత మీకే తెలుస్తుంది. భయపడకండి. జగన్మాత రక్షణ మీకు తప్పక ఉంటుంది" అన్నారు.

-సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు కథలు - రమణ ప్రసాద్

# శ్రీరామకృష్ణ పరమహంస

అతడి కామినీ కాంచన విజయం అత్యద్భుతం. ధనాన్నిగాని, ఏ ఇతర లోహాన్ని గాని అతడు తాకలేకపోయేవాడు. సాధనకాలంలో ఒకచేత మట్టిని, ఒకచేత బంగారాన్ని పట్టుకొని, ఇవి ఐహిక సుఖ సంపాదనకేగాని ఆత్మ సాక్షాత్కారానికి నిరుపయోగమని రెంటినీ గంగలో పారవేశాడు. కాలాంతరంలో అతడి ప్రియ శిష్యుడైన నరేంద్రుడు (వివేకానందస్వామి) అతడి కాంచన విజయాన్ని పరీక్షించాలని అతడి పాన్పు క్రింద ఒక నాణెం పెట్టగా, శ్రీరామకృష్ణుడు పాన్పుమీద కూర్చోగానే తేలు కుట్టినట్లు శరీరం మంటలెత్తగా తటాలున పాన్పుమీదనుంచి దిగేశాడు. లోహస్పర్శనైనా సహింపజాలని అతడి కాంచన విజయాన్ని కళ్ళారా చూసిన శిష్యులు నిశ్చేష్టులయ్యారు. సమస్త స్త్రీలూ అతడి కంటికి జగన్మాత స్వరూపంగానే కనిపించేవారు.



అతడి సత్యనిష్ఠ సత్యహరిశ్చంద్రాది పురాణ పురుషులను తలపుకు తెస్తుంది. ఫలానా రోజున ఒకచోటుకి వస్తాననే వాగ్దానాన్నిగాని, ఒకరి వద్దనుండి ఏదైనా వస్తువు తీసుకుంటాననే మాటను అతడు జవ దాటి ఎరుగడు. ఒకవేళ తన వాగ్దానాన్ని మరచినా అతని మనః శరీరాలు నిరాకరించి ఆ విషయాన్ని అతడికి జ్ఞప్తికి తెచ్చేవి.

**జగద్గురువు :**

1875వ సంవత్సరంలో అతడు బ్రహ్మ సమాజ మహానాయకుడైన కేశవ చంద్రసేన్‌ని కలుసుకొన్నప్పటినుండరామకృష్ణులవారి ఉపదేశామృతం లోకంలో అవిచ్ఛిన్నంగా ప్రసరించసాగింది. అతడి

అసమాన ప్రతిభను, అద్వితీయ ఔన్నత్యాన్ని గురించి మహాప్రవక్త,సుప్రసిద్ధ తత్త్వవేత్త అయిన కేశవ చంద్ర సేన్ తన మహోపన్యాసాలచేత, రచనలచేత లోకానికి చాటాడు. అప్పడు విద్యావంతులు, ఆబాలవృద్ధులు తీర్థ ప్రజలుగా శ్రీరామకృష్ణుల దర్శనార్థమై రాసాగారు. వారిలో ప్రతాప్ చంద్ర మజుమ్‌దార్, శివనాథ శాస్త్రి, విజయకృష్ణ గోపాలస్వామి, దేవేంద్రనాథ ఠాకూర్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బంకిం చంద్ర చట్టోపాధ్యాయ్, మైకేల్ మధుసూదన దత్త్, అశ్వినీ కుమార్ దత్త్ , గిరీశ్చంద్రబోస్ ముఖ్యులు. శ్రీరామకృష్ణుడిని దర్శించి అతడి పట్ల పూజాభావాన్ని వహించి ఆయన గురించి లోకానికి ప్రకటించసాగారు.

ఇలా అతడిని సందర్శించిన అనేకులు ఒక భక్త బృందంగా వెలిశారు. కాలాంతరంలో శ్రీరామకృష్ణుని సందేశాన్ని దేశదేశాంతరాలలో వ్యాప్తం చేసిన ధన్యాత్ములు వారు. అదే సమయంలో నరేంద్రనాథ్ దత్త్ (వివేకానందస్వామి) నాయకత్వంలో కొందరు బాలురు శ్రీరామకృష్ణాశ్రమ సన్యాసులై గురు సందేశ ధర్మజ్యోతిని ప్రజ్వలింపజేసిన యతీంద్రులు.

నరేంద్రనాథ్ బాల శిష్యబృందంలో శ్రీరామకృష్ణుడికి అత్యంత ప్రీతిపాత్రుడై, అఖండానుగ్రహ పాత్రుడై, కాలక్రమాన వివేకానందుడై గురుసందేశాన్ని పాశ్చాత్య ఖండాలలో వ్యాప్తి చేసిన మహనీయుడు. తన అఖండ సేవలచే ఈ యతీశ్వరుడు నూతనోత్తేజాన్ని ప్రభవింపజేసి దేశభక్తాగ్రగణ్యుడై విరాజిల్లాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL